ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 21.0



ఆడిపాటిదిబ్బలు-యర్రంపేట రోడ్డు నిర్మాణం

సంస్కరణలు సరే..

ప్రక్షాళన ఏదీ..?



నేడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జిల్లా పర్యటన

పంచాయతీరాజ్‌లో సంస్కరణలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పెద్దపీట వేశారు. పంచాయతీలను స్వర్ణ పంచాయతీలుగా తీర్చిదిద్ది పరిపాలనలో పారదర్శకత కోసం కస్టర్లను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ పన్నుల వసూళ్ల ప్రక్రియ వేగంగా సాగుతోంది. సంస్కరణ ఫలితాల కంటే అక్రమాలు, జిల్లాలో ఇటీవల అవినీతి భాగోతాలే పెద్ద ఎత్తున బయటపడ్డాయి. మేజర్ పంచాయతీలే కాకుండా, మైనర్ పంచాయతీల్లో సైతం సర్పంచ్‌లు, కార్యదర్శులు కుమ్మక్కై కోట్లలో స్వాహా చేయడం షరా మామూలు అయింది. సంస్కరణలతో పాటే అవినీతి ప్రక్షాళనపై దృష్టి సారించాలి.

- పంచాయతీల్లో అక్రమాలకు కళ్లెం వేస్తారా?
- ఐఎస్ జగన్నాథపురంలో మైనింగ్‌పై చర్యలు శూన్యం!

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని కైకలూరులో రూ.8 కోట్ల మేర అక్రమాలు వెలుగు చూశాయి. ద్వారకాతిరుమల గ్రామపంచాయతీలో 2024లో రూ.2.25కోట్ల లక్షలు అవినీతి జరిగింది. ముదినేపల్లి మండలంలో మైనర్ పంచాయతీ అయిన పెయ్యేరులో ఇటీవల రూ.37 లక్షలు కుంభకోణం, నూజివీడు మండలంలోని ముకాసనరసన్నపాలెం రూ.18లక్షలు నిధులు దుర్వినియోగం బయటపడ్డాయి. తాజాగా భీమడోలు పంచాయతీలో రూ.2కోట్ల పైబడి అక్రమాలు జరిగాయని ఈవోకు తాజాగా డీపీవో షోకాజ్ నోటీసు జారీ చేశారు. కొద్ది నెలల క్రితం ముసునూరు మండలం చింతలవల్లి రూ.32 లక్షలు, వేల్పుచర్లలో రూ.40లక్షలు నిధులు దుర్వినియోగం జరిగింది. 18 నెలలు కాలంలోనే అడ్డగోలు అక్రమాలకు సర్పంచ్‌లు, కొందరు ఈవోలు పంచాయతీ నిధులకు పాల్పడ్డారు. అవినీతి సొమ్ము కక్కించే చర్యలు శూన్యమే. ప్రతీ సంవత్సరంలో పంచాయతీ ఆడిట్‌ల్లో అక్రమాలు బయటపడుతున్నాయి. రిపోర్టుల్లో తేల్చుతున్నా సరిదిద్దుకోవడం లేదు.

విచారణ తూతూ మంత్రం..

పంచాయతీల్లో వెలుగుచూసిన అక్రమాలను నిగ్గు తేల్చేందుకు పారదర్శక విచారణ జరగడం లేదు. డీఎల్‌పీవో చేయాల్సిన విచారణ జిల్లాస్థాయి అధికారులు చేస్తున్నా విశ్వసనీయతకు అర్థం ఉండడం లేదు. విచారణల పేరిట విచారణ అధికారుల వేల సొమ్ము నుంచి లక్షల్లో అక్రమాలు చేయడం పరిపాటిగా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. మరికొద్ది నెలల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అవినీతి సొమ్ములు కక్కించే పటిష్ట యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

అందుబాటులో ఉండేదెవరు?

గ్రామ పరిపాలనలో కీలకంగా వ్యవహరించాల్సి పంచాయతీ కార్యదర్శులు పనిచేసే చోటే నివాసం ఉండడం లేదు. ఈవోఆర్డీలు అయితే చెప్పనవసరం లేదు. జిల్లా పంచాయతీశాఖ పరిధిలో ఇద్దరు డీఎల్‌పీవోలు చెలరేగిపోతున్నారు. వీరంతా పనిచేసే చోట్ల నివాసం ఉండడం లేదు. మరోవైపు అడ్డగోలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

మైనింగ్ వ్యవహారం నీరుగారింది

ఐఎస్ జగన్నాథపురంలో దీపం పథకం -2 ప్రారంభించడానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గతేడాది నవంబరు 1న పర్యటించారు. వైసీపీ హయాంలో అప్పట్లో ఇక్కడ సర్వే నెంబర్ 425లో 8.48 ఎకరాల స్థలంలో మట్టి తవ్వకాల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కొంతమంది ఫిర్యాదు చేశారు. అప్పట్లో దీనిపై నివేదిక అందజేయాలని కలెక్టర్ వెట్రిసెల్విని డిప్యూటీ సీఎం ఆదేశించారు. దీనిపై ఇప్పటికీ తగిన చర్యలు చేపట్టలేదు. రెండోసారి పర్యటనకు వస్తున్న పవన్ కల్యాణ్ పంచాయతీల్లో అక్రమాలు, మైనింగ్ వ్యవహారంపై ఏ నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తిగా మారింది.

పవన్ పర్యటన ఇలా..

ఉప ముఖ్యమంత్రి పర్యటనలో స్వల్ప మార్పు చోటుచేసుకుంది. హెలికాప్టర్‌లో రాజవరం రావల్సిన ఆయన ప్రస్తుతం రోడ్డుమార్గంలో రానున్నట్లు తెలిసింది. రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి కొవ్వూరు. దేవరపల్లి, నల్లజర్ల జాతీయ రహదారిపై పోతవరం, ఆరిపాటి, యర్రంపేట, రాజవరం మీదుగా ఐఎస్ జగన్నాథపురం చేరుకుంటారు.

- ఉదయం 8.30గంటలకు మాదాపూర్ రెసిడెన్సీ నుంచి రోడ్డుమార్గంలో బయలుదేరతారు. బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనున్నారు.
- 8.55 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు.
- 10.05 గంటలకు రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్ నుంచి రోడ్డుమార్గంలో బయలుదేరతారు.
- 11.40 గంటలకు ఐఎస్ జగన్నాథపురంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్దకు చేరుకుంటారు.
- 12.00 గంటలకు స్వామివారి దర్శనం. అనంతరం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. 30 ఎకరాలు భూమి హక్కుపత్రాల అందజేస్తారు.
- 12.35 గంటలకు లక్ష్మీనారసింహుని ఆలయం నుంచి బయలుదేరి ఐఎస్ జగన్నాధపురంలో మేజిక్ డ్రెయిన్లు పరిశీలిస్తారు.
- మధ్యాహ్నం ఒంటి గంటకు ఐఎస్ జగన్నాధపురం నుంచి బయలుదేరి రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు రోడ్డుమార్గాన చేరుకోనున్నారు.
- 1.35 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి మంగళగిరి క్యాంపు కార్యాలయానికి చేరుకోనున్నారు.

- ద్వారకాతిరుమల, ఆంధ్రజ్యోతి

ఐఎస్ జగన్నాథపురంలో భారీ బందోబస్తు



పవన్‌కల్యాణ్ పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్, కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు క్రైం/ద్వారకాతిరుమల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ద్వారకాతిరుమల మండలం జగన్నాధపురంలో సోమవారం పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఐఎస్ జగన్నాథపురంలో సుందరగిరిపై లక్ష్మీనారసింహుని దర్శనం, పలు అభివృద్ధి పనులకు పవన్ కల్యాణ్ సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కేపీఎస్.కిశోర్, జేసీ ఎంజె అభిషేక్ గౌడ ఆదివారం ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్పీ కిశోర్ క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఇటీవల జిల్లాలో 15 మంది మావోయిస్టులు పోలీసులకు పట్టుబడిన నేపథ్యంలో అత్యంత భద్రత చర్యలను చేపట్టారు. కొద్ది రోజుల నుంచి ఎస్పీ కిశోర్ స్వయంగా ఆ ప్రాంతాలను పరిశీలించి పోలీసు అధికారులు, సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేశారు. 300 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తులో నియమించారు. పవన్ కల్యాణ్ పర్యటించే మార్గాలు, సభా స్థలాలు, వాహనాల పార్కింగ్, తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. ప్రజలకు, వాహనదారులకు అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ మళ్లింపు, నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు, ట్రాఫిక్ విభాగాలు, డ్రోన్ కెమెరాల సిబ్బంది బందోబస్తు విధులను పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, డీఎస్పీలు శ్రావణ్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, భీమడోలు సీఐ యుజె విల్సన్, జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ.రమణ పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ పర్యటనతో రోడ్డుకు మహర్దశ

కొయ్యలగూడెం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పవన్ కల్యాణ్ ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాధపురంలోని నరసింహస్వామి ఆలయానికి రానున్న నేపథ్యంలో ఆ మార్గంలో రోడ్లన్నీ అధికారులు హడావుడిగా నిర్మిస్తున్నారు. పవన్ రాజవరంలో హెలీప్యాడ్ దిగి గుడికి వెళతారని హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. తర్వాత ఆయన పర్యటనలో స్వల్ప మార్పు చోటు చేసుకుంది. రాజమండ్రి ఎయిర్‌పోర్ట్‌లో దిగి రోడ్డు మార్గాన రానుండడంతో అధికారులు హుటాహుటిన రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఆరిపాటిదిబ్బల నుంచి రాజవరం వరకు గోతులన్నీ పూడ్చి రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. పవన్ కల్యాణ్ పర్యటనతో తమ రోడ్లు బాగుపడ్డాయని ఆ గ్రామాల ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

నేడు మంత్రి నాదెండ్ల రాక

ఏలూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం జిల్లాకు రానున్నారు. ఉదయం 10 గంటలకు ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురం చేరుకుని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి పలు కార్యక్రమాల్లో నాదెండ్ల పాల్గొంటారు. అనంతరం 12.30 గంటలకు తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి వెళతారు.

నేడు ఏఐసీసీ పరిశీలకుడు ప్రవీణ్ ధావర్ ఏలూరు రాక

మూడు రోజులు జిల్లాలో పర్యటన

ఏలూరు రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ పరిశీలకుడు ప్రవీణ్ ధావర్ సోమవారం ఏలూరు రానున్నారు. జిల్లాలో మూడు రోజుల పాటు నియోజకవర్గాల నేతలతో సమావేశాలు ఏర్పాటు చేశారు. సోమవారం ఏలూరు డీసీసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశంలో పాల్గొంటారు. 25న ఉదయం డీసీసీ కార్యాలయంలో విలేకరుల సమావేశం అనంతరం కైకలూరు వెళతారు. నియోజకవర్గ స్థాయి సమావేశం అనంతరం నూజివీడు చేరుకుంటారు. 26న పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల సమావేశంల్లో పాల్గొంటారు. పార్టీ బలోపేతంపై దిశా నిర్దేశం చేయనున్నారు. ఆయనతో పాటు ఏపీసీసీ ఇన్‌చార్జి పాలక్ వర్మ, ఏపీసీసీ మహిళా అధ్యక్షురాలు తాంతియాకుమారి పాల్గొంటారు. ఏఐసీసీ ఇన్‌చార్జి పర్యటన విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

ఏలూరు రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి పి విశ్వేశ్వరరావు ఆదివారం తెలిపారు. జిల్లాలో ఉప ముఖ్యమంత్రి సోమవారం పర్యటన దృష్ట్యా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందుబాటులో ఉండరని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి, వివిధ శాఖల అధికారులు ప్రజల నుండి వినతులు స్వీకరిస్తారని ఆయన తెలిపారు.

మార్చి 16 నుంచి పది పరీక్షలు

ఏలూరు అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు వచ్చే ఏడాది మార్చిలో జరుగుతాయని డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదివారం తెలిపారు. మార్చి 16నుంచి ఏప్రిల్ 1 వరకు జరుగుతాయని ఆమె అన్నారు. ఉత్తీర్ణత శాతం పెంచడానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతుందని, విద్యార్థులకు బోధన, శిక్షణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు డీఈవో వివరించారు.



సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, తదితరులు

మనుషుల్లో ప్రేమ, సేవాభావం ఉండాలి

ఏలూరు రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ఆదివారం సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. బాబా చిత్రపటానికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి పూలమాల వేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ తమకు తోచిన సేవ చెయ్యాలనీ, అప్పుడే జీవితం సార్థకత చేకూరుతుందని బాబా చెప్పిన సందేశం ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, సత్యసాయి సేవా సంస్థ జిల్లాప్రతినిధులు, ఆర్డీవో ఎం.అచ్యుత అంబరీష్, ఏవో ఎన్వి నాంచారయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సత్యసాయి సేవా సమితి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'రైతన్నా - మీకోసం'

ఏలూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు, పథకాలు వివరించేందుకు జిల్లా యంత్రాంగం సోమవారం నుంచి రైతన్నా.. మీకోసం కార్యక్రమం నిర్వహించనుంది. వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిసెంబరు 3 వరకు రైతుసేవా కేంద్రాల అసిస్టెంట్లు, అనుబంధ రంగాల సిబ్బంది రోజుకు 90 మంది రైతుల ఇళ్లను సందర్శించాలన్నారు. ప్రతీ రైతుకు వ్యవసాయంలో పంచసూత్రాలు, అగ్రిటెక్‌పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. ప్రతీ రైతు స్మార్ట్ ఫోన్లలో రైతన్న మీకోసం యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి, వ్యవసా యంలో ప్రభుత్వ సమాచారాన్ని తెలియజేయాలని ఆమె ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా, ఉద్యానశాఖ అధికారి షాజా నాయక్, మండలస్థాయి వ్యవసాయ, అనుబంధ రంగాల సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్టీసీ ఏలూరు డిపో ముందు నిరసన చేపట్టిన వివిధ యూనియన్లు

ఆర్టీసీ ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్

- నేడు నిరాహార దీక్షకు నిర్ణయం

ఏలూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఏలూరు పెట్రోల్ బంకులో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మూడో రోజు డిపో ముందు ఆదివారం పలు యూనియన్ల నాయకులు నిరసన చేపట్టారు. ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ గత నాలుగేళ్ల జరిగిన రూ.82 లక్షల అమ్మకాల్లో కుంభకోణంపై విచారణ పూర్తిస్థాయిలో జరగకుండా, డబ్బులు కట్టలేని వారిని సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు. పెట్రోల్ బంకు ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు పనిచేసిన డిపో మేనేజర్లు, జిల్లాస్థాయి అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. దిగువస్థాయి ఉద్యోగులపై చర్యలను ఖండిస్తూ యాజమాన్య వైఖరికి నిరసనగా సోమవారం నుంచి నిరాహార దీక్షలు చేపట్టాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ నాలుగేళ్ల నుంచి కుంభకోణం జరుగుతుంటే ఉన్నతాధికారులు ఏం చేశారని ప్రశ్నించారు. ఆడిటర్ సుందరయ్య, ఎమ్మెస్‌రావుతో పాటు మరో ఇద్దరిని సస్పెండ్ చేయడం సరి కాదన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఆంజనేయులు, బాబూరావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వాగులో పడి టెన్త్ విద్యార్థి మృతి

బీచ్‌లో బీటెక్ విద్యార్థి గల్లంతు

అండర్-17 బాస్కెట్‌బాల్ విజేతలు 'కృష్ణా, తూర్పు గోదావరి జట్లు'

లోపలి పేజీలో

రైళ్లు ఫుల్

- సంక్రాంతి పండుగ ఎఫెక్ట్
- ప్రధాన రైళ్లకు నో రిజర్వేషన్
- బుకింగ్ తెరుచుకున్న వెంటనే ఫుల్



వ్యవసాయానికి కూలీల కొరత

- రోజు రోజుకు భారంగా సేద్యం
- అన్నదాతల ఆందోళన
- కూలీలు 40, 50 ఏళ్లు పైబడిన వారే
- ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలంటున్న రైతులు



సోమవరంలో ఉపాధిహామీ పనులకు వెళ్లి వస్తున్న కూలీలు

చాట్రాయి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రోజురోజుకు కూలీల కొరత పెరుగుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో వ్యవసాయం చేయలేమని రైతులు, కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. కూలీల కొరతతో ఇబ్బందులు తలెత్తడంతో ఎక్కువ శాతం మంది రైతులు భూములను కౌలుకు ఇచ్చేస్తున్నారు. పనులు సకాలంలో చేయించడానికి రైతులు కూలీల ఇళ్లకు ఆటోలు పంపించడం, పని ప్రదేశంలో మినరల్ వాటర్, కూల్‌డ్రింక్‌లు అందించడం విశేషం.

కాంట్రాక్ట్ పనులు..!

రోజువారీ కూలీ విధానానికి కాలం చెల్లింది. ఇప్పుడంతా కాంట్రాక్టు పద్ధతి నడుస్తోంది. ప్రతి వ్యవసాయ పనికి డిమాండ్‌ను బట్టి కూలీ రేట్లు వచ్చేశాయి. విత్తనాలు నాటటం దగ్గర నుంచి కోతల వరకు అన్ని పనులకు కాంట్రాక్టు విధానమే. వ్యవసాయ పనులు త్వరగా చేయించుకోవాలనే ఆత్రుతతో రైతుల మధ్యే పోటీ నెలకొని కూలీ రేట్లు పెంచేస్తున్నారు. దీంతో పెట్టుబడులు పెరిగిపోయి నష్టాల పాలు అవుతున్నారు.

ఉపాధికి పట్టణాల బాట

గ్రామాల్లో చదువుకున్న యువత ఉపాధి అవకాశాల కోసం పట్టణాలకు వెళుతున్నారు. కూలి పనులు చేసుకునే వారు సైతం ఉపాధి అవకాశాల కోసం పట్టణాల బాటపడుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో 40, 50 ఏళ్ల పైబడిన వారే వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారు. భవిష్యత్‌లో గ్రామాల్లో వ్యవసాయ కూలీలు మచ్చుకైనా కనిపించని పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఉపాధి పథకాన్ని అనుసంధానం చేయాలి

ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడం వల్ల కూలీల కొరతకు కొంత పరిష్కారం దొరుకుతుందని రైతు సంఘాల నాయకులు అభిప్రాయ పడుతున్నారు. నాట్లు, కోతలు, మొక్కజొన్న కండెలు విరిచూటప్పుడు, మామిడి కోత పనులకు రైతుల ఇబ్బందులు వర్ణనాతీతం.

ప్రభుత్వాలు మేల్కోవాలి



కూలీలు దొరక్క నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కూలీల కొరతతో రానున్నకాలంలో వ్యవసాయం కొనసాగడం కష్టం. గ్రామాల్లో అధిక శాతం ప్రజల జీవనాధారం అయిన వ్యవసాయానికి కూలీల కొరత రూపంలో వస్తున్న ముప్పును ఎదుర్కొటానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి.

- చీకటి శ్రీనివాసరావు, రైతు, చీపురుగూడెం



బీచ్‌లో సండే సందడి

కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లు ఆదివారం పర్యాటకులతో కళకళలాడాయి. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈఏడాది తుపాన్, భారీ వర్షాలు కారణంగా కార్తీకమాసం ప్రారంభమైన పక్షం రోజులు పాటు బీచ్ వద్దకు సందర్శకులను అనుమతించలేదు. కార్తీక ముగిసినా ఆదివారం సముద్ర తీరం పర్యాటకులతో కిటకిటలాడింది. ఎగసి పడుతున్న అలలతో సమానంగా సముద్ర స్నానం చేసి సేద తీరారు. డీఎస్పీ డాక్టర్ శ్రీవేద ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

- మొగల్తూరు, ఆంధ్రజ్యోతి



గంగానమ్మను భూమి పైకి తీసుకొస్తున్న ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్

జనంలోకి గంగానమ్మ

భూమిపై పాదం మోపిన వీధి గంగానమ్మ

ఏలూరు రూరల్, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి): తూర్పు వీధి గంగానమ్మ జాతరలో తొలి ఘట్టం ఆవిష్కృతం కానుంది. డప్పు దరువులు, శివసత్తుల పూనకాలు, తీన్మార్ స్టెప్పులతో మార్మోగుతుంది. ఇప్పటికే నగరం జాతరతో జనసంద్రంగా మారింది. తూర్పువీధి గంగానమ్మను మేడల్లో ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పెద్ద రైల్వే స్టేషన్ సమీపంలో చెరువు పక్కన 11వ శతాబ్దం నాటి బావి నుంచి అమ్మవారిని భూమి పైకి తీసుకువచ్చే పూజ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మూడు రోజులు పాటు పురవీధుల్లో ఊరేగింపు అనంతరం గంగానమ్మ మేడల్లోకి ప్రవేశించే అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. తూర్పువీధి అమ్మవారి జాతర కమిటీ కన్వీనర్ వంకినేని భానుప్రకాష్, వంకినేని సాయిబాబు, వంకినేని మహేంద్ర, ముసునూరి బాలాజీ, కలగర శివరాం ప్రసాద్, కలగల కిశోర్ పర్యవేక్షించారు.

నేడు క్రికెట్ అండర్ -14, 17 విభాగాల్లో
ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలు

ఏలూరు అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని యాజమాన్యాల హైస్కూళ్ల విద్యార్థులకు క్రికెట్ అండర్-14, 17 బాలురకు జిల్లాస్థాయి జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తు న్నామని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.దుర్గాప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం పెదవేగి మండలం వంగూరులోని ఏఎన్ఎం క్రికెట్ అకాడమీలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. క్రీడాదుస్తులు, బ్యాట్, బాల్, ప్యాడ్, వాటర్ బాటిల్‌తో సహా క్రీడాకారులు హాజరు కావాల న్నారు. వివరాలకు 81433 96604, 98853 24848 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు

ఏలూరు రూరల్, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం డిసెంబరు మూడో తేదీని పురస్కరించుకుని ఈనెల 25న విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ, అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరులో అల్లూరి సీతారామరాజు స్టేడి యంలో ఉదయం 9 గంటల నుంచి పలు క్రీడా విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. 600 మంది క్రీడాకారులు పాల్గొంటారని, పోటీలను ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి ప్రారంభిస్తారని తెలిపారు.


ఏలూరు జిల్లా నూతన కార్యవర్గానికి ఎన్నికైన పీఎస్‌హెచ్‌ఎంలు

‘పీఎస్‌హెచ్‌ఎం’ల ఫోరం జిల్లా నూతన కార్యవర్గం

ఏలూరుఅర్బన్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): ‘పీఎస్‌హెచ్‌ఎం’ ఫోరం ఏలూరు జిల్లా శాఖ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.శ్రీనివాసరావు(ఎంపీపీఎస్, రామసింగవరం, పెదవేగి మండలం), కె.నాగేశ్వరరావు (ఉంగుటూరు) ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం స్థానిక పవర్‌పేట లోని మున్సి పల్ ప్రాథమి కోన్నత పాఠశాలలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల (పీఎస్‌హెచ్‌ఎం) ఫోరం జిల్లాశాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. గౌరవ అధ్యక్షుడిగా ఎం.పోతురాజు(కె.ముప్పర్రు, పెదపాడు), సహ అధ్యక్షుడిగా ఎన్.కొండయ్య(అన్నేవారిగూడెం, భీమడోలు) ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఉపాధ్యక్షుడిగా బి.చంద్రశేఖర్(అడవికొలను, నిడమర్రు), అదనపు కార్యదర్శిగా ఎ.మురళీకృష్ణ(పూళ్ల) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అనంతరం జరిగిన సంఘ తొలి సమావేశంలో పీఎస్‌హెచ్‌ఎం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి.మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం తొలిసారిగా ఏర్పాటుచేసిన పీఎస్‌హెచ్‌ఎం వ్యవస్థ లక్ష్యాన్ని నెరవేర్చడానికి హెచ్‌ఎంలు కృషిచేయాలని కోరారు.

స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పోస్టులకు దరఖాస్తులు

ఏలూరు క్రైం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ పోస్టులకు తాత్కాలిక పద్ధతిపై భర్తీకి ప్యానెల్‌లో తమ పేర్లను చేర్చడం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా జడ్జి ఎస్.శ్రీదేవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరు జిల్లాలో స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ పోస్టులు-4 ఖాళీగా ఉన్నాయని, సదరు పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను నిర్దేశించిన దరఖాస్తు ఫారంలో, అర్హతల ధ్రువీకరణ పత్రాలు నకళ్లు అటెస్ట్ చేసినవి, ఫొటోలు మూడు ప్రతులతో జిల్లా జడ్జి, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు వారి కార్యాలయంనకు డిసెంబరు 12వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా అందేలా పంపాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.45 వేల గౌరవ వేతనం చెల్లిస్తారన్నారు. వివరాలకు నోటిఫికేషన్‌ను జిల్లా కోర్టులో, ఏలూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్ కార్యాలయాలు, స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ కార్యాలయాలు, బార్ అసోసియేషన్‌లలోని నోటీసు బోర్డులో ప్రదర్శనకు ఉంచడం జరుగుతుందన్నారు.

ఘనంగా సత్యసాయి శత జయంత్యుత్సవాలు



సత్యసాయి చిత్రపటం వద్ద నివాళులు

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంత్యు త్సవాలు తాడేపల్లిగూ డెంలోని వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీ ఆవరణలో ఘనంగా ఆదివారం నిర్వహించారు. వర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, అధికారులు సత్యసాయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని సత్యసాయి మందిరంలో నగర సంకీర్తన, సత్యసాయి వ్రతాలు, భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆకుల నవీన్‌బాబా, ప్రవా శ్రీనివాస్, గాదే శ్రీరామచంద్రమూర్తి పాల్గొనారు.

లండన్ టెక్నాలజీతో వ్యవసాయ క్షేత్రం ప్రారంభం


వ్యవసాయ క్షేత్రాన్ని ప్రారంభించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): లండన్‌లో ఫుడ్ ప్రాపెసింగ్ ఇంజనీరింగ్ చేసిన ఆరుళ్లకు చెందిన మాకరాజు హేమంత్ వర్మ అధునాతన లండన్ టెక్నాలజీతో నిర్మించిన నూతన వ్యవసాయ క్షేత్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ టెక్నాలజీతో మట్టి, ఎరువులు, పురుగు మందులు అవసరం లేకుండా కూరగాయలు, స్ట్రాబెరి, మెడిసిన్ ప్లాంట్స్ ఏర్పాటుచేశారు. ఈ వ్యవసాయ క్షేత్రాన్ని వైసీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి రఘురాం నాయుడు ప్రారంభించారు. ఎంపీపీ పి.శేషులత, మాజీ సర్పంచ్ మాకరాజు సతీష్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.


కృష్ణా జిల్లా బాలుర విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నాయకులు

అండర్-17 ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ విజేతలు
‘కృష్ణా, తూర్పు గోదావరి జట్లు’

నూజివీడు టౌన్, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 69వ అండర్-17 బాస్కెట్‌బాల్ విజేతలుగా కృష్ణా, తూర్పుగోదావరి జిల్లా జట్లు నిలిచాయి. నూజివీడు బేతస్త ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాస్కెట్‌బాల్ బాల బాలికల టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. దీనిలో బాలుర విజేతగా కృష్ణా జిల్లా జట్టు నిలవగా, బాలికల టోర్నమెంట్‌ను తూర్పుగోదావరి జట్టు కైవసం చేసుకుంది. ఆదివారం నిర్వహించిన ఫైనల్లో బాలుర విభాగంలో తూర్పుగోదావరి జిల్లా జట్టుపై కృష్ణా జిల్లా జట్టు 18-39 స్కోర్‌తో విజయకేతనం ఎగురవేసింది. రెండో స్థానంలో తూర్పుగోదావరి జిల్లా, మూడో స్థానంలో గుంటూరు జిల్లా, నాలుగో స్థానంలో చిత్తూరు జిల్లా జట్లు నిలిచాయి.

ఇక బాలికల విభాగంలో గుంటూరు జట్టుపై 6-23 స్కోర్‌తో తూర్పు గోదావరి జట్టు విజయం సాధించింది. రెండో స్థానంలో గుంటూరు జట్టు, మూడో స్థానంలో విశాఖపట్నం జిల్లా, నాలుగో స్థానంలో కృష్ణా జిల్లా జట్లు నిలిచాయి. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి నూజివీడు డీవైఈవో సుధాకర్, పట్టణ సీఐ పి.సత్యశ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంపికైన బాస్కెట్‌బాల్ క్రీడాకారులు డిసెంబర్ నెలలో చత్తీస్‌గడ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు తెలిపారు. కృష్ణా జిల్లా బాలుర అండర్-17 విభాగంలో వరుసగా 8వసారి మొదటి ప్లేస్ సాధించారన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ అబ్జర్వర్ పి.కృష్ణ, 13 ఉమ్మడి జిల్లాల కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు, సబ్జెక్ట్ వ్యాయాయ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైళ్లు ఫుల్

సంక్రాంతి పండగకు ఈసారి ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని పలు పట్టణ, గ్రామాలకు రైళ్లలో వచ్చేందుకు ప్రయత్నించిన ప్రయాణికులందరికీ నిరాశే మిగిలింది. 60 రోజుల ముందుగానే టిక్కెట్లు నిండుకున్నాయి. ఇటు బుకింగ్‌లు తెరిచిన రోజు దగ్గర నుంచి ఇదే రద్దీ. అటు జనవరి 8 నుంచి తిరుగు ప్రయాణంలో జనవరి 17 నుంచి ఇదే సీన్ కొనసాగింది. ప్రస్తుతం అన్నిరైళ్లకు స్లీపర్, ఏసీ తరగతుల్లో రిగ్రెట్ చూపిస్తున్నది. అంటే నో టిక్కెట్ అని అర్థం. కనీసం వెయిటింగ్ లిస్టు టిక్కెట్‌లు కూడా రావడం లేదు. ‘దూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు ఏవిధంగా రావాలి’ అనే దానిపై ప్రయాణికుల్లో ఇప్పటి నుంచే టెన్షన్ నెలకొంది. టిక్కెట్లు దొరకని ప్రయాణికులంతా స్పెషల్ రైళ్ల కోసం ఎదురు చూస్తున్నారు.




కిటకిటలాడుతున్న రైల్వేస్టేషన్(ఫైల్)

సంక్రాంతి పండుగ రద్దీతో నిండుకున్న టిక్కెట్లు

- ప్రధాన రైళ్లకు నో రిజర్వేషన్
- బుకింగ్ తెరుచుకున్న వెంటనే ఫుల్
- ప్రత్యేక రైళ్ల కోసం ఇప్పటినుంచే ప్రయాణికుల ఎదురుచూపు

నరసాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా సంక్రాంతికి ఉమ్మడి పశ్చిమ జిల్లా మీదుగా నడిచే అన్ని రైళ్లకు మంచి డిమాండ్ ఉంటుంది. స్వగ్రామాలకు వచ్చే ప్రయాణికులంతా ముందుగా అప్రమత్తంగా ఉంటారు. గతంలో రిజర్వేషన్ 90 రోజుల ముందుగా ఉండేది. ప్రస్తుతం దాన్ని 60 రోజులకు కుదించారు. ఈ లెక్కగట్టి ప్రయాణికులు టికెట్లు బుక్ చేసుకున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తిరుపతి వంటి నగరాల నుంచి జిల్లాకు వచ్చే రైళ్లన్నీ నిండుకున్నాయి. వీటికి 60 రోజుల ముందు నుంచి టిక్కెట్ రిజర్వేషన్ చేయించుకోవడం మొదలు పెట్టారు.

ఈ కారణంగా జనవరి 8 నుంచి 13 వరకు ఏ రైళ్లకు టిక్కెట్లు లేవు. తిరుగు ప్రయాణంలో 17 నుంచి 21 వరకు ఇదే సీన్ ఉంది. ప్రధానంగా నరసాపురం నుంచి నడిచే లింగంపల్లి, నాగర్‌సోల్, విశాఖ, గోదావరి, శేషాద్రి, గౌతమి వంటి ఎక్స్‌ప్రెస్‌లకు కనీసం వెయిటింగ్ లిస్టు టిక్కెట్ కూడా దొరకని పరిస్థితి నెలకొంది.

రిజర్వేషన్లు ఇలా..

- లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 9 నుంచి 13 వరకు రిగ్రెట్ చూపిస్తున్నది. 14న స్లీపర్‌లో 16 వెయిటింగ్ లిస్టు ఉంది.ఏసీలో 14న 10 వెటియింగ్ లిస్టు చూపిస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలుకు 17, 18, 19వ తేదీల్లో రిగ్రెట్ ఉంది. 20న స్లీపర్ 150 వెయిటింగ్ లిస్టు ఉండగా ఏసీలో 20న 13 వెయిటింగ్ ఉంది.
- శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌కు బెంగళూరు నుంచి 9, 10, 11, 12 తేదీల్లో స్లీపర్, ఏసీ తరగతుల్లో రిగ్రెట్ ఉంది. 13న స్లీపర్ 36, ఏసీ 14 వెటియింగ్ లిస్టు చూపిస్తుంది. తిరుగు ప్రయాణంలో 17, 18, 19 తేదీల్లో ఏసీ, స్లీపర్ రిగ్రెట్ ఉంది. 20న వెయిటింగ్ లిస్టు స్లీపర్‌లో 34, ఏసీలో 10 చూపిస్తుంది.
- ఇక పశ్చిమ గోదావరి జిల్లా మీదుగా నడిచే సర్కార్‌లో 9. 10, 11, 12వ తేదీల్లో ఏసీ, స్లీపర్‌లో రిగ్రెట్ ఉంది. 13న స్లీపర్‌లో వెయిటింగ్ లిస్టు 200 ఉంటే ఏసీ 70 ఉంది. తిరుగు ప్రయాణంలో 17, 18, 19 తేదీల్లో ఏసీ, స్లీపర్‌లో రిగ్రెట్ కనిపిస్తుంది. 20న స్లీపర్‌లో 20 టికెట్లు దొరుకుతున్నాయి.
- గౌతమి ఎక్స్‌ప్రెస్.. ఏలూరు జిల్లాలోని ఏలూరు, టీపీగూడెం మీదుగా నడిచే గౌతమిలో 8,9,10,11,12వ తేదీల్లో ఏసీ, స్లీపర్ రీగ్రీట్ ఉంది. 13న వెయిటింగ్‌లిస్టు కనిపిస్తుంది. తిరుగు ప్రయాణంలో 20న స్లీపర్‌లో 130 వెయిటింగ్ లిస్టు ఉంది.
- గోదావరి రైలుకు సికింద్రాబాద్ నుంచి నడిచే గోదావరి ఎక్స్‌ప్రెస్‌లోనూ ఇదే సీన్ ఉంది. 9 నుంచి 13 వరకు ఈ రైలులో రిగ్రెట్ కనిపిస్తుంది. తిరుగు ప్రయాణంలో 20 వరకు నో టిక్కెట్. ఇక నాగర్‌సోల్, విశాఖ వంటి ప్రధాన ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ నుంచి జిల్లా వరకు ఇదే సీన్ కనిపిస్తుంది.

స్పెషల్ రైళ్లను ముందుగా ప్రకటించాలి



ప్రతి ఏడాది పండుగలకు ముందుగా టికెట్లు నిండుకోవడం సర్వసాధారణం. అయితే రైల్వే స్పెషల్ రైళ్లను జనవరి ఆరంభంలో ప్రకటిస్తుంది. దీనివల్ల చాలామందికి టికెట్లు దొరకడం లేదు. ఈసారి ఈ విధంగా కాకుండా ముందుగా ప్రకటించాలి. డిమాండ్ ఉన్న రూట్లలో ఎక్కువ రైళ్లు నడపాలి.

- సీహెచ్ బాలాజి, నరసాపురం


ఆలయంలో కోలాట ప్రదర్శన నిర్వహిస్తున్న బాలలు, మహిళలు

వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దివ్యక్షేత్రం ద్వారకాతిరుమల ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివాహాలు జోరుగా జరుగతుండడం, శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన మార్గశిరం ప్రారంభం కావడంతో పాటు అందరికీ సెలవు రోజు అవడం వల్ల ఉదయం నుంచే ఆలయానికి యాత్రికుల రాక ప్రారంభమైంది. దేవస్థానంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. 15 వేల మందికి పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది. సాయంత్రం నుంచి రద్దీ కాస్త తగ్గుముఖం పట్టింది.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

చినవెంకన్న ఆలయ అనివేటి మండప ప్రాంతంలో ఆదివారం బాలలు, మహిళలు నిర్వహించిన కోలాట ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. పెద చింతలపూడికి చెందిన శ్రీరాధాకృష్ణా కోలాట బృందం బాలలు, మహిళలు ముందుగా సంప్రదాయ దుస్తులు ధరించి క్షేత్రానికి వచ్చి కోలాటాలు జరుపుతూ స్వామి అమ్మవార్లను దర్శించు కున్నారు.

చెరువులో చనిపోయిన చేపలను తొలగించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


చనిపోయిన చేపలను తీస్తున్న కూలీలు

పాలకోడేరు, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): విస్సాకోడేరు పంచాయతీ చెరువులో ‘చని పోయిన చేపలు- దుర్వాసన వెదజల్లుతున్న తాగునీరు’ అంటూ ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన కథనానికి విస్సాకోడేరు పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామంలో తాగునీరందించే మంచినీటి చెరువులో చేపలు చనిపోయి తేలడంతోపాటు దుర్వాసన వెదజల్లడంతో సర్పంచ్ బొల్లా శ్రీనివాస్ నేతృత్వంలో ఆదివారం పంచాయతీ సెక్రటరీ పవన్‌కుమార్, సిబ్బంది చెరువులో తేలియాడుతున్న చేపలను కూలీల సాయంతో బయటకు తీయించారు. ఉన్నతాధికారుల సూచనలతో చెరువులో కలుషితమైన జలాలను ఇంజన్ల సాయంతో బయటకు తోడించారు. ఈ కార్యక్రమాన్ని ఈవోపీఆర్‌డీ రామ్‌ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పర్యవేక్షించారు.

మాంసం ప్రియులకు పండుగ

» కార్తీక మాసం ముగియడంతో నాన్‌వెజ్‌కు ‘ఆదివారం’ క్యూకట్టిన జనం » చికెన్ షాపుల వద్ద సందడి

- కొద్దిగా తగ్గిన కూరగాయల ధరలు
- ప్రియమవుతోన్న టమాటా.. దిగివచ్చిన వంకాయ
- స్థిరంగా ఉల్లిపాయలు




తాడేపల్లిగూడెంలోని చికెన్ సెంటర్ వద్ద జనం

కార్తీకమాసం ముగిసిన అనంతరం వచ్చిన ఆదివారం ఒక్కసారిగా చికెన్ షాపుల వద్దకు మాంసాహారులు ఎగబడ్డారు. 32 రోజుల పాటు వీటికి దూరంగా ఉన్నవారు ఆదివారం ఎక్కడ చూసిన చికెన్, మటన్, చేపలు, రొయ్యల దుకాణాల వద్ద కొనేందుకు క్యూకట్టారు. ఆయా ఈ ప్రాంతాల్లో సందడి నెలకొంది. విశేషమే మిటంటే వీటి ధరలు పెరగక పోవడమే. ఈ వారం ధరలు పెరగవని వచ్చేవారం నుంచి చికెన్ ధరలు పెరుగుతా యని వ్యాపారులు చెబుతున్నారు.

తాడేపల్లిగూడెం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి)

కార్తీక మాసం ప్రభావంతో మార్కెట్‌కు అవసరాలకు అనుగుణంగా మాత్రమే కార్పొరేట్ సంస్థలు సరఫరా చేసేవారు. అయితే వీరు పెంచిన కోళ్ల సైజు విపరీతంగా ఫారంలలో ఇప్పటికే పెరిగి ఉన్నాయి. ఈ స్టాక్ తగ్గేవరకు ధరలు పెరగవని చెబుతున్నారు. పెరిగిన కోళ్లను పూర్తిగా మార్కెట్‌కు పంపేసిన తరువాత చికెన్ రేటు పెరుగుతుందని చెబుతున్నారు. ఆదివారం ఒక్కరోజునే పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 110 టన్నుల చికెన్, ఏలూరు జిల్లాలో 65 టన్నుల చికెన్ వినియోగ మైనట్టు వ్యాపారులు చెబుతున్నారు. సాధారణంగా మటన్ కంటే సామాన్యులు కోడి మాంసాన్నే ఎక్కువగా ఇష్టపడతారు. వారి ఆర్థిక పరిస్థితులకు అనువుగా చికెన్ ధర అందుబాటులో ఉండటం దీనికి కారణం. మటన్ కొనుగోలు చేయాలంటే కిలో రూ.1000 పెట్టాలి. అదే స్కిన్‌లెస్ చికెన్ అయినా రూ.220కు మించి ఉండదు. ఈ మేరకు మధ్యతరగతి, బలహీన వర్గాలవారు చికెన్ కొనుగోలుకే ఎక్కువ ఇష్టపడతారు.

దిగివస్తున్న కూరగాయల ధరలు

కూరగాయల ధరలు దిగివస్తున్నాయి. రైతు బజారు కాకుండా మార్కెట్లో ఉల్లిపాయ కాకుండా మిగిలిన కూరగాయల ధరలు గత వారం కిలో రూ.80పైనే విక్రయించారు. ఈ వారం మాత్రం దాదాపు అన్ని కూరగాయల ధరలు కిలోకు రూ.20 తగ్గాయి. కిలో రూ.120కు వెళ్లిన వంకాయలు ఇప్పుడు రూ.80కు పడింది. రూ.100 వరకు వెళ్లిన బీర ఇప్పుడు రూ.70, దొండ, బెండ, దోస కాయలు రూ.80 వరకు వెళ్లాయి ఇప్పుడు అవి రూ.60కు తగ్గాయి. క్యారెట్, బీట్‌రూట్ మాత్రం స్థిరంగా రూ.80 వద్దనే ఉన్నాయి. ఆకాకర, క్యాప్సికమ్ రూ.120కు విక్రయిస్తున్నారు. కాకర రూ.60, అరటి జత రూ.20, ఆనభకాయ రూ.30, పొట్ల కాయ రూ.40కు అమ్మకాలు జరిగాయి.

ఆకాశాన్నంటిన మునగ..

మార్కెట్లో మునగకాడ ధరలు ఆకాశాన్నంటాయి. ఎన్నడూ లేని విధంగా కిలో రూ.250కు విక్రయిస్తున్నారు. రిటైల్‌గా జత రూ.50కు అమ్మారు. గత నెలలో ఇదే మునగ జత రూ.35 నుంచి రూ.40 మధ్యలో విక్రయాలు జరిగాయి. ఇప్పుడు కిలో రూ.250 చేరడం పట్ల సర్వత్రా చర్చనీయాంశమైంది. మొంథా తుఫాన్ ప్రభావంతో మునగతోటలు దెబ్బతిని విరిగిపోవడం, పూత రాలిపోవడంతో దిగుబడి పూర్తిగా తగ్గడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వ్యాపారులు చెబుతున్నారు.

టమాటా అ‘ధర’హో..



టమాటా ధరలు పెరుగుతున్నాయి. గత నెలలో కిలో రూ.20 ఉండేవి.. ఇప్పుడు రూ.60కు చేరింది. మదనపల్లి, చిత్తూరు, బెంగళూరు నుంచి వచ్చే టమాటా తక్కువగా దిగుమతి కావడంతో ధర పెరిగింది. 23 కిలోలు ఉండే ట్రే రూ.1500కు కొనుగోలు చేయాల్సి వస్తుందని రిటైల్ వ్యాపారులు చెబుతున్నారు. ఇదే ట్రేను మదనపల్లి మార్కెట్లో గత నెలలో రూ.200లకు రైతుల వద్ద నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసింది. ఇప్పుడు టమాటాకు దిగుబడి తక్కువగా ఉండడంతో మంచి డిమాండ్ ఏర్పడింది.

స్థిరంగా ఉల్లి ధరలు

మార్కెట్లో ఉల్లి ధరలు స్థిరంగానే ఉన్నాయి. గత వారంతో పోల్చుకుంటే వ్యత్యాసం ఏమీ లేదు. మార్కెట్‌కు మహారాష్ట్ర నుంచి 5 లారీలో 154 టన్నుల ఉల్లి వచ్చింది.. ఈ ఉల్లి మధ్యరకంగా ఉండడంతో క్వింటా రూ.1300 నుంచి రూ.1500 మధ్య అమ్మకాలు జరిగాయి. నాణ్యమైన ఉల్లి రూ.1800 నుంచి 2000 మధ్యలో అమ్మారు. ఇక రిటైల్‌గా నాణ్యమైన ఉల్లి రూ.100 నాలుగు కిలోలు, మధ్యరకం ఉల్లి రూ.100కు 5కిలోలు, సాధారణ రకం ఉల్లి రూ.100కు 6 కిలోలు వంతున అమ్మారు.

క్రైం సమాచారం

వేర్వేరు చోట్ల నలుగురి మృతి

ఆగిన లారీని ఢీకొట్టి మోటారు సైక్లిస్టు మృతి

భీమవరం క్రైం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడు ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్న ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలివి.. భీమవరం మండలం గొల్లవానితిప్ప గ్రామానికి చెందిన తాళ్ళూరి శామ్యూల్‌రాజు(21) పెయింటింగ్ పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 22న రాత్రి పెయింటింగ్ పని ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. గ్రామ సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టి మృతి చెందాడు. మృతుడి తాత ప్రభుదాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

భీమవరం క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వృద్ధుడు ప్రమాదవశాత్తు రోడ్డుపై పడి గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ హెచ్‌సీ వెంకటరెడ్డి తెలిపిన వివరాలివి.. భీమవరం మండలం కొమరాడ గ్రామానికి చెందిన రాట్నాల చినదేవయ్య(75) ఈనెల 21న గొల్లవానితిప్ప గ్రామం నుంచి కొమరాడ వెళ్తున్నాడు.ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించారు. గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి మనుమడు రామాయణం సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..


టి.నరసాపురం, నవంబరు 23 : కలుపు మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. బొర్రంపాలెం గ్రామానికి చెందిన నేటి కిరణ్ కుమార్ (18) చదువు మానేసి ప్రస్తుతం కూలి పనులకు వెళుతున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై బాధ్యతారాహిత్యంగా తిరుగుతుండడంతో తండ్రి మందలించాడు. ఈనెల 21వ తేదీన బొర్రంపాలెం గ్రామ శివార్లలో గ్రీన్ ఫీల్డ్ హైవే పక్కన కలుపు మందు తాగాడు. కుటుంబ సభ్యులు జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యానికి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి సుధాకర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు తెలిపారు.

వాగులో పడి టెన్త్ విద్యార్థి మృతి


యశ్వంత్ (ఫైల్)

జీలుగుమిల్లి, నవంబరు 14 : (ఆంధ్రజ్యోతి) : ఓ వాగులో పడి ఈత రాక విద్యార్థి మృతి చెందిన ఘటన జీలుగుమిల్లి మండలం బొత్తప్పగూడెం వద్ద జరిగింది. తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట శివారు దొంతిగుంటకు చెందిన గుమ్మళ్ల విజయ్, లిజి దంపతుల చిన్న కుమారుడు యశ్వంత్(15) అశ్వారావు పేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సరదాగా ఐదుగురు మిత్రులు కలిసి కామయ్య పాలెం పంచాయతీ బొత్తప్పగూడెం సమీప వాగులో స్నానానికి దిగారు. వీరిలో యశ్వంత్‌తోపాటు మరో ఇద్దరు స్నానాలు చేస్తూ ప్రమాదవశాత్తు మునిగిపోతుండగా వాగు ఒడ్డున ఉన్న మరో ఇద్దరు కేకలు వేశారు. ఆ కేకలు విన్న సమీప పొలాల్లో పనిచేసేవారు వచ్చి ముగ్గురిని బయటకు లాగారు. ఇద్దరు ప్రాణాలతో ప్రమాదం నుంచి బయట పడగా యశ్వంత్ అప్పటికే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వాగు వద్దకు వచ్చి బోరున విలపించారు. మృతదేహాన్ని తీసుకువెళ్లారు. ఈ విషయమై హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణను వివరాలు అడగ్గా ఫిర్యాదు రాలేదన్నారు.

బీచ్‌లో బీటెక్ విద్యార్థి గల్లంతు


గణేష్ (ఫైల్)

మొగల్తూరు, నవంబరు23(ఆంధ్రజ్యోతి): పేరుపాలెం బీచ్‌లో స్నానానికి దిగిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఏలూరులోని కొత్తపేటకు చెందిన మునగాల మోహనసాయిగణేష్ అనే 18 ఏళ్ల యువకుడు విజయవాడలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ముగ్గురు స్నేహితులతో కలిసి బీచ్‌కు వచ్చిన అతడు సముద్రంలో స్నానానికి దిగిన కొద్దిసేపటికే అలల ఉధృతికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఎస్ఐ జి.వాసు, మెరైన్ ఎస్ఐ పి.సోమశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో గాలింపు చర్యలు చేపట్టారు.


టిడ్కో గృహాల వద్ద సాక్షులను విచారిస్తున్న సీఐడీ ఏఎస్పీ అస్మఫర్హీన్ (రాజమండ్రి)

మంత్రి నిమ్మలపై దాడి ఘటనపై సీఐడీ విచారణ

- 2022లో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన కుట్ర
- అప్పట్లో కేసు నమోదు చేయని పోలీసులు

పాలకొల్లు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మంత్రి నిమ్మల రామానాయుడుపై జరిగిన దాడి ఘటనపై పాలకొల్లులో ఆదివారం సీఐడీ బృంద సభ్యులు, రాజమండ్రి సీఐడీ ఏఎస్పీ అస్మఫర్హీన్ నేతృత్వంలో విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆనాడు జరిగిన సంఘటన ప్రాంతమైన టిడ్కో గృహాల కాలనీ వద్ద లబ్ధిదారులు, సాక్షులను విచారణ చేశారు. ఆనాడు దాడి చేసిన సంఘటనపై పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆనాటి ఫిర్యాదును కేసుగా నమోదు చేశారు. 2022లో వైసీపీ ప్రభుత్వం పట్టణంలోని టిడ్కో గృహాల కాలనీ వద్ద జరిగిన గృహాల పంపిణీ కార్యక్రమంలో సభావేదిక వద్ద వైసీపీ నాయకుల పెద్దల కుట్రపూరిత పథకం ప్రకారం సభకు అధ్యక్షత వహించాల్సిన ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుతో పాటు అప్పటి ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ తదితర టీడీపీ వారిని వేదికపైకి ఎక్కుతుండగా కిరాయి మూకలను స్టేజీమీదకు ఎక్కించి నిమ్మలను హతమార్చాలని కత్తి వంటి ఆయుధం ఉపయోగించారని, తీవ్ర పదజాలంతో దూషిస్తూ గెంటివేడంతో వేదిక కిందకు పడిపోయారని తెలిపినట్టు సమాచారం. దాడికి పాల్పడిన వ్యక్తి నుంచి ఆనాడు కత్తిని స్వాధీన పరుచుకున్నారని విచారణలో తెలిపారు. ఈ ఘటనపై అప్పట్లో తాడి శశిధర్ పాలకొల్లు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, ఆనాటి వైసీపీ నాయకుల ఒత్తిడితో పోలీసులు కేసు నమోదు చేయలేదు. సీఐడీ బృందం విచారణలో నరసాపురం డీఎస్పీ శ్రీవేద, పట్టణ సీఐ కె.రజనీకుమార్ ఉన్నారు.

బాలుడి మృతితో డిప్పకాయలపాడులో విషాదచాయలు



కొయ్యలగూడెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అప్పటివరకు బోసి నవ్వులతో ఆడుకున్న బాలుడు అకాలమరణంతో ఆ తల్లిదండ్రుల రోదన అంతా ఇంతా కాదు. డిప్పకాయలపాడులో ఉగ్గం విష్ణు, జ్యోతికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు సౌర్య(2) శనివారం మృతి చెందాడు. అయితే తండ్రి నడుపుతున్న ట్రాక్టర్ కిందే పడి మృతి చెందడంతో తండ్రి రోదన పలువురిని కంట తడి పెట్టించింది. రెండేళ్ల బాలుడు మృతి చెందడంతో గ్రామస్థులంతా కన్నీటి పర్యంతం అయ్యారు. తల్లిదండ్రులు ఉగ్గం విష్ణు, జ్యోతి బోరున విలపిస్తున్నారు. బాధిత కుటుంబాన్ని గ్రామస్థులంతా ఓదార్చారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి.

సీఎం, డిప్యూటీ సీఎం పటాలకు క్షీరాభిషేకం



ద్వారకాతిరుమల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని వంగిడిగూడెంలో బిలాల్ మజీద్ అభివృద్ధికి రూ.1.80 కోట్లు నిదులు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతూ నేతలు ఆదివారం పాలాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మీరా సాహెబ్, ద్వారకాతిరుమల సొసైటీ చైర్మన్ పోలిన శ్రీనివాసరావు పాల్గొన్నారు. పలువురు మైనార్టీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శివదేవుడి ఆలయంలో శిఖర ప్రతిష్ఠ ఉత్సవాలు

ద్వారకాతిరుమల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): క్షేత్రపాలకుడైన శివదేవుడి ఆలయంలో నూతనంగా నిర్మించిన ఆలయ రాజగోపురం, దానిపై శిఖరప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ నెల 21న ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఆదివారం జరిగిన శ్రీమహాపూర్ణాహుతితో పూర్తయ్యాయి. ఈక్రమంలో ఉదయం ఆలయాన్ని పరిసరాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణంలో మహా గణ పతి పూజ, పుణ్యాహ వచనం నిర్వహించారు. ఆలయ ట్రస్టీ ఎస్వీ నివృతరావు, ఈవో ఎస్వీ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

సుందరయ్యపై చర్యలు అన్యాయం : సీఐటీయూ

చింతలపూడి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):ప్రజారవాణా వ్యవస్థ ఆర్టీసీ ఏలూరు డిపోలో యాజమాన్యం నిర్వహిస్తున్న పెట్రోలు బంకులో లక్షలాది రూపాయల విలువైన ఆయిల్ మాయం కేసులో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సి.హెచ్. సుందరయ్యను సస్పెండ్ చేయడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.వి. సత్యనారాయణ, మండల కన్వీనర్ నత్తా వెంకటేశ్వరరావు ఖండించారు. లక్షలాది రూపాయలు అవినీతి చేసిన అధికారి స్థాయి నుంచి దిగువ స్థాయి వరకు రికవరీ చేసి వారిని శిక్షించకుండా దీంతో ఏ సంబంధంలేని సుందరయ్యను సస్పెండ్ ఎలా చేస్తారని ప్రశ్నించారు. నిజాయితీగా పనిచేస్తున్న నాయకులను ఇరికించి అధికారులు చేసిన తప్పును నాయకులు సుందరయ్య మీద నెట్టి సస్పెండ్ చేయడం ఆర్టీసీ చరిత్రలోనే కొత్త అధ్యాయానికి తెర లేపారని, ఇప్పటికైనా తప్పు చేసిన వారిని శిక్షించి సుందరయ్యపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాట్నాల కుంట శ్రీరాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీర వెంకట రామసత్యనారాయణశర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గ మాలార్చన నిర్వహించారు. పూజా రుసుములు ద్వారా రూ.36,510, లడ్డూ ప్రసా దాల విక్రయాల ద్వారా రూ.18,885, ఫొటో విక్రయాల ద్వారా రూ.2280 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ఎన్.సతీశ్ కుమార్ తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా పాలకవర్గ చైర్మన్ మన్నే శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అర్జయ్య మృతి రైతు కూలీ ఉద్యమానికి తీరని లోటు

బుట్టాయగూడెం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ధర్మల అర్జయ్య అకాల మరణం రైతుకూలీ, భూపోరాట ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా, డివిజన్ ప్రధాన కార్యదర్శులు టి.సుధాకర్, ధర్మల సురేష్ అన్నారు. మండలంలోని వాడపల్లి కాలనీకి చెందిన అర్జయ్య శనివారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. ఆయనకు నాయకులు ఎర్రజెండాను కప్పి నివాళులర్పించారు. 1993 నుంచి చేసిన పోరాటాలు వలన 135 ఎకరాల వరకు ఆదివాసీలు భూములు సాధించుకున్నారని అన్నారు. నాయకులు కె.వి.రమణ, కారం రాఘవ, ఎస్.రామ్మోహన్, ఈ.భూషణం, బి.వినోద్, టి.బాబూరావు, కె.రామలక్ష్మి పాల్గొన్నారు.

ధర్మాజీగూడెంలో తాగునీటికి కటకట



లింగపాలెం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మాజీగూడెం పం చాయతీలో పలు కాలనీల్లోని 400 ఇళ్లకు వారం రోజులుగా తాగునీరందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాహాన్ని తీర్చుకునేందుకు బిందెడు నీళ్లు లేక ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. తమ దాహాన్ని తీర్చండి సారూ... అంటూ విన్నవించుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ప్రజలకు తాగునీరందించే మోటార్లు పాడవడంతో కొన్ని రోజులుగా తాగునీరందడం లేదు. కనీస అవసరాలకు కూడా నీరు లేక పోవ డంతో పంచాయతీ అధికారులకు పలుమార్లు సమాచారం అందించినా పట్టించు కోవడంలేదని ప్రజలు మండిపడుతున్నారు.తాగునీటి కోసం వ్యవసాయ బావులు, వాటర్ ట్యాంకులను ఆశ్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన నాయకులు కొందరు వాటర్ ట్యాంకర్ల సహకారంతో కాలనీ వాసులకు తాగునీరందిస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ గ్రామస్థులు కోరుతున్నారు.



సాధించిన పతకాలతో ఎన్‌సీసీ కేడెట్లు

ఘనంగా ఎన్‌సీసీ ఆవిర్భావ వేడుకలు


ఏలూరు అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నేషనల్ క్యాడెట్ కాప్స్(ఎన్‌సీసీ) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఏలూరులో ఐక్యతా ర్యాలీ, సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్లో గౌరవ వందనాన్ని, మాదేపల్లి రోడ్డులోని ప్రేమాలయంలో వృద్ధమాతలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ కార్యక్రమాలు వేర్వేరుగా నిర్వహించారు. ఐక్యతా ర్యాలీలో ఎన్‌సీసీ హవల్దార్లు కాశీరావు, రమణ్ దీప్ సింగ్‌లు నాయకత్వం వహించారు. అనంతరం పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన వేడుకల్లో క్యాడెట్లు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.స్కూలు ప్రిన్సిపాల్ పి.సాయి కుమారి మాట్లాడుతూ దేశసేవలోనూ, సామాజిక సేవలోనూ ఎన్‌సీసీ క్యాడెట్ల కార్యకలాపాలు చిరస్మరణీయమన్నారు.ప్రతిభను కనబరిచిన క్యాడెట్లకు పతకాలు అందజేశారు. ఎన్‌సీసీ ఏఎన్‌వో అనంత, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు నిలుపుదల చేయాలి : ఐఎఫ్‌టీయూ




జంగారెడ్డిగూడెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేసిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే నిలుపుదల చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెవి.రమణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డులో కార్మిక సంఘాలతో ఆందోళన చేశారు. ఈ నెల 21 నుంచి నాలుగు లేబర్ చట్టాల అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడం దుర్మార్గమన్నారు. ఎడ్లపల్లి ఏసు, గడ్డం నాగేంద్ర, కొత్తూరి సీతయ్య, దొండపాటి వెంకటేశ్వరరావు, దిర్శిపాము వెంకటేశు, రాజు పాల్గొన్నారు.

అందరి రక్షణ కోసం దివ్య బలి పూజ



దెందులూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అందరి కోసం దివ్య బలిపూజ నిర్వహిస్తున్నట్టు ఏలూరు ఆర్‌సీఎం పీఠం వికార జనరల్, సెయింట్ జాన్స్ సంస్థల కరస్పాండెంట్ రెవ ఫాదర్ డాక్టర్ పి.బాల తెలిపారు. ఆదివారం మండలంలోని సోమవరప్పాడులో బీఈడీ కళాశాలలో 20 మంది ఫాదర్లతో కలిసి ప్రత్యేక దివ్య పూజ నిర్వహించారు. ఫాదర్లు గాబ్రియేలు, మోజెస్, బాబు జార్జి మాట్లాడుతూ సేవ, ఆధ్యాత్మిక రంగాల్లో 38 ఏళ్ల ఏలూరు పీఠంలో దేవుని సేవలందిన డాక్టర్ ఫాదర్ బాలను పలువురు అభినందించారు.

జనసేన పార్టీ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేత



దెందులూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు బీమా చెక్కులను జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు ఆదివారం అందజేశారు. దెందులూరు మండలం కొవ్వలి గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త, కొవ్వలి గ్రామ ఆలయ పురోహితులు, జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులు తునికపాటి సూర్యకాంత శర్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆదివారం వారి కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ తరపున రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు, స్థానిక నాయకులు కొఠారు ఆదిశేషు, లక్ష్మీలతో కలిసి అందజేశారు.

పెదపాడులో ఘనంగా అయ్యప్ప స్వాముల పూజలు

దెందులూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం గ్రామానికి చెందిన 30 మంది అయ్యప్ప భక్తులు పెదపాడులోని శివాలయంలో రాంబాబు, సాంబ శివరావు గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకుని శబరిమల కొండకు బయల్దేరి వెళ్లారు. శివాలయంలో పూజల అనంతరం తరలివెళ్లారు.



మాట్లాడుతున్న ఆర్డీవో రమణ



సత్యసాయి చిత్రపటానికి పూలు చల్లుతున్న ఏఎస్పీ



జంగారెడ్డిగూడెంలో నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

సత్యసాయి బోధనలు అనుసరించాలి

ద్వారకాతిరుమల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మానవత్వాన్ని ప్రబోధిస్తూ ప్రజలకు సేవామార్గాన్ని అనుసరించాలని సూచించిన భగవాన్ శ్రీసత్యసాయి ఆదర్శమని జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎన్వీ రమణ అన్నారు. సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను పురస్కరించుకుని మండలంలోని సి.హెచ్.పోతేపల్లిలోని సత్యసాయి ఆలయాన్ని ఆమె దర్శించి పూజించారు. మానవసేవే మాధవ సేవ అని భావించిన ఆయన అనేక సేవా కార్యక్రమాలు తలపెట్టారన్నారు. సాయి మార్గాన్ని అనుసరిస్తే ప్రపంచమంతా శాంతిగా ఉంటుందన్నారు. సత్యసాయి సేవాసంస్థ అధ్యక్షులు చెలికాని సోంబాబు, తహసీల్దారు జె.వి.సుబ్బారావు పాల్గొన్నారు.

● పెదవేగి:సమాజానికి శ్రీసత్యసాయి బాబా సత్య మార్గాన్ని సూచించారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం జానంపేట సమీపంలో నియోజకవర్గంలోని ఉద్యోగులకు ఆటవిడుపుగా ఏర్పాటు చేసిన గార్డెన్ పార్టీలో శ్రీసత్యసాయి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సత్యసాయి శత జయంతిని దేశం యావత్తు ఒక పండుగలా జరుపుకుంటోందన్నారు. టీడీపీ నాయకులు యు.ఎస్.రామ్ ప్రసాద్, ఈడ్పుగంటి అనిల్, బొప్పన సుధాకర్, గుత్తా అనిల్, మోతుకూరి నానీ, నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

జయంతి వేడుకల్లో వక్తలు

● ఏలూరుటూటౌన్: సత్యసాయి సేవలు ప్రపంచానికి ఆదర్శనీయమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. రామకృష్ణపురంలోని శ్రీసత్యసాయి సేవా కేంద్రం భగవాన్ శ్రీసత్య సాయిబాబా శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ సత్యసాయిబాబా మానవాళిని సేవా మార్గం వైపు నడిపించారన్నారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, చైర్మన్ శివప్రసాద్, పైడేటి రామారావు, కార్పొరేటర్ హెచ్‌డీ ప్రసాద్, ఎస్. శాంతకుమారి, ఈశ్వర్‌లాల్, జగన్ పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం:భగవాన్ సత్యసాయి బాబా జయంతి కార్యక్రమం ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కె.ఆర్.ఎస్.కృష్ణప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీడీవో కృష్ణప్రసాద్ సత్యసాయి బాబా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయ ఏవో చుక్కా గోపాలకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో ఎం.సునీల్, సుధారాణి పాల్గొన్నారు.

● దెందులూరు: ఆధ్యాత్మిక గురువు, భగవాన్ శ్రీ సత్యసాయి బాబా జయంతి వేడుకలను దెందులూరు, పెదపాడు తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించారు. దెందులూరు తహసీల్దార్ బత్తుల సుమతి, పెదపాడు తహసీల్దార్ కృష్ణజ్యోతి, పోలీసుల ఆధ్వర్యంలో సత్యసాయి జయంతి సందర్భంగా సత్యసాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యాశాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ ఆర్ఐ ఆదిత్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

● ఏలూరు క్రైం: పురాతన కాలం నుంచి మనసాధువులు, రుషులు వారి చర్యలు, మాటల ద్వారా సమాజానికి మార్గనిర్దేశం చేస్తున్నారని అలాంటి వారిలో శ్రీ సత్యసాయిబాబా ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నారని జిల్లా ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు సందర్భంగా ఆయన చిత్రపటానికి అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాతిక చింతన వైపు నడవాలన్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. పోలీసు అధికారులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: సత్యసాయిబాబా జన్మదిన వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక గ్రామాల్లో ప్రత్యేక వ్రతాలు నిర్వహించారు. అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. మండలంలోని కన్నాయిగూడెం, కొయ్యలగూడెం, రాజవరం తదితర గ్రామాల్లో ఘనంగా వేడుకలు జరిగాయి.

ఇక నుంచి గుంతలు కనిపించవు

● రోడ్లకు ఎమ్మెల్యేల శంకుస్థాపనలు



శ్రీనివాసపురంలో రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 23,(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, గుంతలు లేని రోడ్డు నిర్మాణాలను ఎన్‌డీఏ ప్రభుత్వం చేపట్టనుందని చింతలపూడి, పోలవరం ఎమ్మెల్యేలు సొంగా రోషన్ కుమార్, చిర్ర బాలరాజులు అన్నారు. ఆదివారం మండలంలోని శ్రీనివాసపురం, అక్కంపేట గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయి.ముఖ్య అతిథులుగా చింతలపూడి, పోలవరం ఎమ్మెల్యేలతో పాటు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. జడ్పీ నిధులు రూ.3 కోట్లతో శ్రీనివాసపురం, అక్కంపేట గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అలాగే రూ.1.50కోట్లుతో శ్రీనివాసపురం నుంచి ములగలంపల్లి వరకు నిర్మించే బీటీ రోడ్డు, అక్కంపేట గ్రామానికి రూ.55 లక్షలతో నిర్మించే బీటీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌లు కృషి చేస్తున్నారని అన్నారు. పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల్లో గోతులు లేని రోడ్లు చూడనున్నామని ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం మెయిన్ రోడ్డు పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. దేవులపల్లి-లక్కవరం, దేవులపల్లి-జంగారెడ్డిగూడెం ఇలా రెండు నియోజకవర్గాల్లో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. అనంతరం శ్రీనివాసపురం గ్రామంలోని జడ్పీటీసీ పోల్నాటి బాబ్జి ఇంటికి వెళ్లి ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు మాధవరావు, ఎలికే ప్రసాద్, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, చెరుకూరి శ్రీధర్, జనసేన నాయకులు కరాటం సాయిబాబు, ఆకుల రాకేష్ పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులు శబరిమలైకు పయనం



ద్వారకాతిరుమల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పలువురు భక్తులు ఇరుముడులతో శబరిమలైకు పయనమయ్యారు. దీంతో ద్వారకా తిరుమల ఆలయ తొలిమెట్టు వద్ద ఉన్న శ్రీవారి పాత కల్యాణ మండప ఆవరణ ఆధ్యాత్మికత శోభిల్లింది. అయ్యప్ప దేవుని స్తుతిస్తూ భక్తి ప్రపత్తులతో కీర్తనలు చేశారు. అనం తరం కుటుంబ సభ్యులు వారి శిరస్సులపై ఇరుముడులు ఉంచగా వారు ద్వారకాతిరుమలేశుని దర్శించి అనంతరం శబరిమలైకు పయనమయ్యారు.



రాంబాబు దంపతులను సత్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నాయకులు

అవార్డు గ్రహీతకు సత్కారం

ఏలూరు రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఏపీ బులియన్, డైమండ్ మర్చంట్ అసోసియేషన్ జోనల్ చైర్మన్ కె.రామకృష్ణ ప్రసాద్ (కేకేఎస్ రాంబాబు)అత్యంత ప్రతిష్ఠాత్మమైన ఉత్తమ జుయ్యలరీ అవార్డు అందుకున్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్న సందర్భంగా ఆదివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు లక్కోజు రాజగోపాలాచారి ఆధ్వర్యంలో రాంబాబు దంపతులను ఘనంగా సత్కరించారు. ఉత్తమ జ్యుయ్యలరీ అవార్డు రావడం అభినందనీయమన్నారు. నాణ్యతతో కూడిన బంగారపు వెండి వస్తువులు స్థానిక స్వర్ణకారులతో తయారు చేయించడం వల్ల స్వర్ణకారులకి ఉపాధి కల్పిస్తు ఎంతో మందికి సహాయ సహాయం అందిస్తున్నారని కొనియాడారు. నల్లబాటి కామేశ్వరరావు, గోరస మణి కుమార్, నల్లబాటి కృష్ణప్రసాద్, గమిని శ్రీనివాసరావు, లక్కోజుసాయి, ఈదలాడ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్యం

పెదవేగి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సేవాగుణం వ్యక్తి ఉన్నతిని తెలియజేస్తుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం జగన్నాథపురంలోని బెయెర్షెబా ప్రార్థనా మందిరం ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జగన్నాథపు రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 500 మందికి వైద్య సేవలందించారు. డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ కిరణ్, డాక్టర్ లక్ష్మీ కిరణ్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కె.గాంధీ, గ్రామస్థులు నానాజీ, రమేశ్ పాల్గొన్నారు.



గడివాకలంకలో వైద్య సేవలందిస్తున్న బృందం

14 గ్రామాల్లో వైద్య శిబిరాలు

ఏలూరు రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్వాస్థ్య సేవ - రాష్ట్ర సేవ అనే నినాదంతో నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్, తపన ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు చుట్టు పక్కల ఉన్న 14 గ్రామాల్లో మెగా ఉచిత వైద్య శిబిరాలను ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. ఆరోగ్య సేవ ద్వారా దేశసేవ చేయవచ్చనే మహోన్నత లక్ష్యంతో ఈకార్యక్రమాన్ని చేపట్టారు. ఈ శిబిరాలతో దాదాపు 100 మంది వైద్య విద్యార్థులు, 20 మంది అనుభవజ్ఞులైన డాక్టర్లు వివిధ గ్రామాల్లో ఉన్న సుమారు 800మంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ప్రాంత సంఘటన కార్యదర్శి డాక్టర్ సాగర్ కుళ్ళాయి రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్‌రావు,డాక్టర్ విజయలక్ష్మీ, సాయినాథ్‌రెడ్డి, సాహిత్య రాఘవరెడ్డి పాల్గొని తమ సేవలందించారు.



నూతన కార్యవర్గ సభ్యులు

సర్వే ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

ఏలూరు రూరల్, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సర్వే ఉద్యోగుల సంఘం ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈసందర్భంగా ఏలూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా టీవీఎస్ వి రమణరావు మూడోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఎం.విష్ణుమూర్తి,కార్యదర్శిగా ఎస్.ధర్మారావు, సహాయ కార్యదర్శిగా ప్రదీప్ కుమార్, ట్రెజరర్ నాగజ్యోతి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పి.రమాదేవి, మహ్మద్ సముద్దీన్ కె.శ్రీనివాస్‌రెడ్డి,కె.రవికుమార్, ఎస్ రాజశేఖర్ రెడ్డి, ఇ.రమేష్‌లను ఎన్నుకున్నారు. కె.బాల వెంకటేష్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

గుబ్బల మంగమ్మకు పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీ అటవీ ప్రాంతంలో ఉన్న గుబ్బల మంగమ్మను దర్శించుకోడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారి దర్శనాలకు బారులుతీరారు. భక్తులు అధికంగా తరలిరావడంతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిటకిట లాడింది. ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.



విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే చంటి

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

ఏలూరుటూటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తకాలకు మాత్రమే పరిమితం కాకుండా చట్టసభల్లో, వాటి పనితీరు, మారుతున్న టెక్నాలజీ, రాజకీయాలు ప్రభుత్వ వ్యవస్థల పనితీరువంటి, రాష్ట్రాభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే చంటి అన్నారు. సుబ్బమ్మదేవి హైస్కూల్ టెన్త్ విద్యార్థి గంధం లితిక మాక్ అసెంబ్లీకి ఎంపికయ్యారు. పాఠశాలలో లితికను అభినందించిన ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ బాలలకు చట్టసభల గొప్పతనం, పనితీరుపై అవగాహన కల్పించేందుకు మంత్రి నారా లోకేశ్ రూపొందించిన మాక్‌అసెంబ్లీకి ఏలూరు నియోజకవర్గంలో జరిగిన వివిధ రకాల పోటీల్లో పాల్గొని లితిక ఎంపికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మాక్ అసెంబ్లీకి ఎన్నిక కావడం గర్వంగా ఉందని లితిక అన్నారు. హెచ్ఎం కుటుంబరావు పాల్గొన్నారు.



ఉద్యోగుల వనభోజనాల్లో ఎమ్మెల్యే చింతమనేని

ఉద్యోగులకు వన సమారాధన

పెదవేగి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విధుల్లో భాగంగా నిత్యం సతమతమయ్యే ఉద్యోగులు వారి ఉద్యోగ జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిలను జయిస్తేనే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వీలుంటుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అ న్నారు. దెందులూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన అన్నిశాఖల అధికారులు, సిబ్బం దికి పెదవేగి మండలం జానంపేట సమీపంలోని విజయ గార్డెన్స్‌లో ఆదివారం వన సమారాధన నిర్వ హించారు. ఉద్యోగులంతా పాల్గొని ఆనందంగా గడి పారు. ఈ రోజును ఏడాదిపాటు జ్ఞాపకం చేసుకుంటూ ఉత్సాహంతో పనిచేయాలన్నారు.



పంపిణీకి సిద్ధంగా ఉంచిన కృత్రిమ కాళ్లు

దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు పంపిణీ

ఏలూరుటూటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఏలూరు హేలాపూరి లయన్స్ సమగ్ర సేవా ట్రస్ట్, దివ్యశ్రీ రావి పద్మకుమారి కృత్రిమ కాళ్ల తయారీ కేంద్రం, హేలాపూరి చైతన్య లయన్స్ క్లబ్, ఏలూరు హేళపూరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ కాళ్ల ఉచిత పంపిణీ శిబిరం అశోక్ నగర్ లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం నిర్వహించారు. క్లబ్‌జోనల్ చైర్మన్ కె.బి.రావు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులకు స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించామన్నారు. 50 మందికి కృత్రిమకాళ్లు దాతల చే తుల మీదుగా పంపిణీ చేశామన్నారు. భగవాన్ శ్రీసత్య సాయిబాబా శత వసంతాల వేడుకలు పురస్కరించుకుని బాబా చిత్రపటానికి పూల మాలలు వేసినివాళులర్పించారు. లయన్స్ గవర్నర్‌లు పాపారావు నాయుడు, డాక్టర్ డి.సుబ్బారావు, రీజనల్ చైర్మన్ శ్రీనివాస్ గోపాల్, డిస్ట్రిక్ట్ చైర్మన్ వెంకటేశ్వర్లు, దుశ్యంత్ పాల్గొన్నారు.

నాట్యాచార్యుడికి పురస్కారం అందజేత



ఏలూరు రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అభినయ నృత్య భారతి వ్యవస్థాపకుడు హేమసుందర్ సప్పా ఎక్సలెన్సు జాతీయ పురస్కారం అందుకున్నారు. ఆదివారం రాజమండ్రిలో జరిగిన పురస్కార ప్రదానోత్సవంలో తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి మునిరత్నం, అంతర్జాతీయ వాస్తు నిపుణులు కె.వి.రెడ్డి చేతుల మీదుగా హేమసుందర్ పురస్కారాన్ని అందుకున్నారు.



రశీదు అందజేస్తున్న ట్రస్టీ, ఈవోలు

నూతన కలశాల బహూకరణ

ద్వారకాతిరుమల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): క్షేత్రపాలకుడైన శివదేవుడి ఆలయానికి ఓ దాత కుటుంబం రూ.1.90 లక్షల విలువైన 8 ఇత్తడి కలశాలను కానుకగా సమర్పించారు. రాజమహేంద్రవరానికి చెందిన కొక్కర్లపాటి వెంకట రామరాజు దంపతులు వీటిని ఆలయానికి అందచేశారు. ఈసందర్భంగా ఆయనను ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ఈవో ఎస్వీ సత్యనారాయణమూర్తి ఘనంగా సత్కరించారు. వీటి బరువు సుమారు వంద కేజీల వరకు ఉందని దాత తెలిపారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వరుడైన సుబ్రహ్మణ్యేశ్వరుడు

ద్వారకాతిరుమల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయంలో స్వామి వారి దివ్యకల్యాణ మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం సుబ్రహ్మణ్యేశ్వరుని పెండ్లి కుమారుడిగాను, వల్లీ, దేవసేన అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగాను చేశారు. ఆలయాన్ని పరిసరాలను పుష్పమాలికలు, అరటిబోదెలు, మామిడి తోరణాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.



సారా బట్టీలపై దాడులు చేస్తున్న పోలీసులు

ఎక్సైజ్ శాఖ దాడులు

ఏలూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని లింగపాలెం, చింతలపూడి, టి.నర్సాపురం మండలాల్లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్‌ఫోర్సు అధికారులు ఆదివారం బెల్టుషాపులు, సారాపై విస్తృతంగా దాడులు చేశారు. ఇందులో ఈస్ట్ యడవల్లి గ్రామానికి చెందిన ఈడా పార్వతి, రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన పీకా మురళిని అరెస్టు చేసి వారి నుంచి నాలుగు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. వీరిని రిమాండుకు పంపారు. టి.నర్సాపురం మండలం వల్లంపట్లలో పలగాని సురేష్‌కు చెందిన 300 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసినట్టు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.పాండు రంగారావు, టాస్క్‌ఫోర్సు సీఐ పి.సత్యవతి, సబ్ ఇన్‌స్పెక్టర్ కేఎండీ ఆరీఫ్ పాల్గొన్నారు.



ఈదులగూడెంలో పడిపూజ

ఆగిరిపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదులగూడెంలో శనివారం స్థానిక వీరాంజనేయస్వామి ఆలయం వద్ద అయ్యప్ప పడిపూజను గురుస్వామి అమన్ ఘనంగా నిర్వహించారు. పండితారాధ్యుల సుబ్రహ్మణ్యం శర్మ(శర్మస్వామి) భజన గీతాలు ఆలపించారు.

నవ దంపతులకు మంత్రి పార్థసారథి ఆశీర్వాదం



ఆగిరిపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వడ్లమానులోని గోవర్ధన్ గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన వివాహ వేడుకకు మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొని నవదంపతులను ఆశీర్వదించారు. ఆగిరిపల్లికి చెందిన మాదుల శివరాం ప్రసాద్, నీలిమల ద్వితీయ కుమార్తె చందన, బొప్పన కృష్ణారావు, విశాలి దంపతుల కుమారుడు సాయి మహేశ్‌ల వివాహం ఆదివారం జరిగింది.

రైళ్లు ఫుల్

సంక్రాంతి రద్దీతో నిండుకున్న టిక్కెట్లు



నరసాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు ఈసారి ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని పలు పట్టణ, గ్రామాలకు రైళ్లలో వచ్చేందుకు ప్రయత్నించిన ప్రయాణికులందరికీ నిరాశే మిగిలింది. 60 రోజుల ముందుగానే టిక్కెట్లు నిండుకున్నాయి. ఇటు బుకింగ్‌లు తెరిచిన రోజు దగ్గర నుంచి ఇదే రద్దీ, అటు జనవరి 8 నుంచి తిరుగు ప్రయాణంలో జనవరి 17 నుంచి ఇదే సీన్ కొనసాగింది. ప్రస్తుతం అన్ని రైళ్లకు స్లీపర్, ఏసీ తరగతుల్లో రిగ్రెట్ చూపిస్తుంది. అంటే నో టికెట్ అని అర్థం. కనీసం వెయింట్ లిస్టు టిక్కెట్‌లు కూడా రావడం లేదు. 'దూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు ఏవిధంగా రావాలి' అనే దానిపై ప్రయాణికుల్లో ఇప్పటి నుంచే టెన్షన్ నెలకొంది. టికెట్లు దొరకని ప్రయాణికులంతా స్పెషల్ రైళ్ల కోసం ఎదురుచూస్తున్నారు.

ప్రతి ఏటా సంక్రాంతికి ఉమ్మడి పశ్చిమ జిల్లా మీదుగా నడిచే అన్ని రైళ్లకు మంచి డిమాండ్ ఉంటుంది. స్వగ్రామాలకు వచ్చే ప్రయాణికులంతా ముందుగా అప్రమత్తంగా ఉంటారు. గతంలో రిజర్వేషన్ 90 రోజుల ముందుగా ఉండేది. ప్రస్తుతం దాన్ని 60 రోజులకు కుదించారు. ఈ లెక్కగట్టి ప్రయాణికులు టికెట్లు బుక్ చేసుకున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తిరుపతి వంటి నగరాల నుంచి జిల్లాకు వచ్చే రైళ్లన్నీ నిండుకున్నాయి. వీటికి 60 రోజుల ముందు నుంచి టికెట్ రిజర్వేషన్ చేయించుకోవడం మొదలు పెట్టారు. ఈ కారణంగా జనవరి 8 నుంచి 13 వరకు ఏ రైళ్లకు టికెట్లు లేవు. తిరుగు ప్రయాణంలో 17 నుంచి 21 వరకు ఇదే సీన్ ఉంది. ప్రధానంగా నరసాపురం నుంచి నడిచే లింగంపల్లి, నాగర్‌సోల్, విశాఖ, గోదావరి, శేషాద్రి, గౌతమి వంటి ఎక్స్‌ప్రెస్‌లకు కనీసం వెయిటింగ్ లిస్టు టిక్కెట్ దొరకని పరిస్థితి నెలకొంది.

రేపు విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు

ఏలూరు రూరల్, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం డిసెంబరు మూడో తేదీని పురస్కరించుకుని ఈనెల 25న విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ, అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరులో అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి పలు క్రీడా విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. 600 మంది క్రీడాకారులు పాల్గొంటారని, పోటీలను ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి ప్రారంభిస్తారని తెలిపారు.



ఏలూరు జిల్లా నూతన కార్యవర్గానికి ఎన్నికైన పీఎస్‌హెచ్‌ఎంలు

'పీఎస్‌హెచ్‌ఎం'ల ఫోరం జిల్లా నూతన కార్యవర్గం

ఏలూరుఅర్బన్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): 'పీఎస్‌హెచ్‌ఎం' ఫోరం ఏలూరు జిల్లా శాఖ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.శ్రీనివాసరావు(ఎంపీపీఎస్, రామసింగవరం, పెదవేగి మండలం), కె.నాగేశ్వరరావు (ఉంగుటూరు) ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం స్థానిక పవర్‌పేటలోని మున్సి పల్ ప్రాథమి కోన్నత పాఠశాలలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల (పీఎస్‌హెచ్‌ఎం) ఫోరం జిల్లాశాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. గౌరవ అధ్యక్షుడిగా ఎం.పోతురాజు(కె.ముప్పవ్వరు, పెదపాడు), సహ అధ్యక్షుడిగా ఎన్.కొండయ్య(అన్నేవారిగూడెం, భీమడోలు) ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఉపాధ్యక్షుడిగా బి.చంద్రశేఖర్(అడవికొలను, నిడమర్రు), అదనపు కార్యదర్శిగా ఎ.మురళీకృష్ణ(పూళ్ల) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అనంతరం జరిగిన సంఘ తొలి సమావేశంలో పీఎస్‌హెచ్‌ఎం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి.మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం తొలిసారిగా ఏర్పాటుచేసిన పీఎస్‌హెచ్‌ఎం వ్యవస్థ లక్ష్యాన్ని నెరవేర్చడానికి హెచ్‌ఎంలు కృషిచేయాలని కోరారు.

ఎక్సైజ్ శాఖ దాడులు

ఏలూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని లింగపాలెం, చింత లపూడి, టి.నర్సాపురం మండలాల్లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్‌ఫోర్సు అధికారులు ఆది వారం బెల్టుషాపులు, సారాపై విస్తృతంగా దాడులు చేశారు. ఇందులో ఈస్ట్ యడవల్లి గ్రామానికి చెందిన ఈడా పార్వతి, రాజుపో తేపల్లి గ్రామానికి చెందిన పీకా మురళిని అరెస్టు చేసి వారి నుంచి నాలుగు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. వీరిని రిమాండుకు పంపారు. టి.నర్సాపురం మండలం వల్లంపట్ల లో పలగాని సురేష్‌కు చెందిన 300 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమో దు చేసినట్టు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.పాండు రంగారావు, టాస్క్‌ఫోర్సు సీఐ పి.సత్యవతి, సబ్ ఇన్‌స్పెక్టర్ కేఎండీ ఆరీఫ్ పాల్గొన్నారు.



కృష్ణా జిల్లా బాలుర విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నాయకులు

అండర్-17 ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ విజేతలు 'కృష్ణా, తూర్పు గోదావరి జట్లు'

నూజివీడు టౌన్, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 69వ అండర్-17 బాస్కెట్‌బాల్ విజేతలుగా కృష్ణా, తూర్పుగోదావరి జిల్లా జట్లు నిలిచాయి. నూజివీడు బేతస్త ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాస్కెట్‌బాల్ బాల బాలికల టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. దీనిలో బాలుర విజేతగా కృష్ణా జిల్లా జట్టు నిలవగా, బాలికల టోర్నమెంట్‌ను తూర్పుగోదావరి జట్టు కైవసం చేసుకుంది. ఆదివారం నిర్వహించిన ఫైనల్లో బాలుర విభాగంలో తూర్పుగోదావరి జిల్లా జట్టుపై కృష్ణా జిల్లా జట్టు 18-39 స్కోర్‌తో విజయకేతనం ఎగురవేసింది. రెండో స్థానంలో తూర్పుగోదావరి జిల్లా, మూడో స్థానంలో గుంటూరు జిల్లా, నాలుగో స్థానంలో చిత్తూరు జిల్లా జట్లు నిలిచాయి.

ఇక బాలికల విభాగంలో గుంటూరు జట్టుపై 6-23 స్కోర్‌తో తూర్పుగోదావరి జట్టు విజయం సాధించింది. రెండో స్థానంలో గుంటూరు జట్టు, మూడో స్థానంలో విశాఖపట్నం జిల్లా, నాలుగో స్థానంలో కృష్ణా జిల్లా జట్లు నిలిచాయి. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి నూజివీడు డీవైఈవో సుధాకర్, పట్టణ సీఐ పి.సత్యశ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంపికైన బాస్కెట్‌బాల్ క్రీడాకారులు డిసెంబర్ నెలలో చత్తీస్‌గఢ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు తెలిపారు. కృష్ణా జిల్లా బాలుర అండర్-17 విభాగంలో వరుసగా 8వసారి మొదటి ప్లేస్ సాధించారన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ అబ్జర్వర్ పి.కృష్ణ, 13 ఉమ్మడి జిల్లాల కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు, సబ్జోన్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



సింగరాయపాలెంలో ఉన్న ఆలయం



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పుట్ట



ఆలయ ఆవరణలో నాగప్రతిమలు



పెదలంకలో ఆలయం, సుబ్రహ్మణ్య స్వామి

రేపటి నుంచి షష్టి ఉత్సవాలు

ఆలయాల్లో అధికారుల ప్రత్యేక ఏర్పాట్లు - 13 రోజులు నిర్వహించేందుకు చర్యలు

ముదినేపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి వార్షిక షష్టి కల్యాణోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు డిసెంబరు 7 వరకు 13 రోజుల పాటు జరుగుతాయి. ఉత్సవాల నిర్వహణకు దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంతో పాటు పరిసరాల్లోను విద్యుద్దీపాలంకరణతో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు.

ఉత్సవ కార్యక్రమాలు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని, వల్లీ దేవసేన అమ్మవార్లను ఈ నెల 25న పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేస్తారు. 26న ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పుట్టలో పాలు పోసి ఉత్సవాలను ప్రారంభిస్తారు. రాత్రి స్వామివార్ల కల్యాణం జరగనుంది. 27న పూజలు, 29న రథోత్సవం, 30న తెప్పోత్సవం, డిసెంబరు 1న రుద్రాభిషేకం, 3న అష్టోత్తర శత కలశార్చన, 4న సుబ్రహ్మణ్య హవనం, 7న అన్నసమారాధన జరుగుతాయని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి తెలిపారు.



గంగా శ్రీదేవి.. వీరభద్ర శర్మ

సుమారు 70 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో షష్టి ఉత్సవాల్లో భక్తులు సంతృప్తి చెందేలా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. దేవస్థానం వద్ద వైద్య ఆరోగ్య శాఖ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ మాట్లాడుతూ సింగరాయపాలెంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మహామహిమాన్వితుడని, భక్తులు కోరిన కోర్కెలు తీరుస్తాడని అన్నారు.

పెదలంకలో షష్టి ఉత్సవాలకు ఏర్పాట్లు..

కలిదిండి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పెదలంకలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి ఉత్సవాలు ఈ నెల 25వ తేదీ నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శేఖర్ తెలిపారు. 25 రాత్రి 7 గంటలకు మాజీ వీఆర్వో అడివి రామదాసు దంపతులచే స్వామికి అఖండ దీపారాధన అష్టోత్తర పూజ, 26న తెల్లవారుజామున మాజీ పంచాయతీ కార్యదర్శి పోకల వెంకటేశ్వరరావు దంపతులచే పుట్టలో పాలు పోయటం అనంతరం స్వామి దివ్య దర్శనం, అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.తొమ్మిది రోజులు పాటు జరిగే ఉత్సవాల కోసం చలువ పందిళ్లు వేసి రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. భక్తుల దర్శనం కోసం ప్రత్యేకంగా లైన్లను ఏర్పాటు చేశారు. ఉత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సంతానం లేని వారికి స్వామిని దర్శించుకుంటే ఆ భాగ్యం కలుగుతుందని నానుడి. దీంతో పెదలంక పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు షష్టి పర్వదినాన విచ్చేసి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకుంటారు. ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు.

నేటి నుంచి పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ సర్వే

మండలంలో 59 పాఠశాలలకు 5 టీముల ఏర్పాటు

ముదినేపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు అమలు జరుగుతున్న తీరుతెన్నులపై ముదినేపల్లి మండలంలోని ఐదు క్లస్టర్ల పరిధిలోని 59 ప్రాథమిక పాఠశాలల్లో విద్యాశాఖ ఏర్పాటు చేసిన టీములు సోమవారం నుంచి ఎఫ్ఎల్ఎన్ సర్వే నిర్వహించనున్నాయి. ఆర్‌జేడీ ఆదేశాల మేరకు మండలంలోని బొమ్మినంపాడు, అల్లూరు, పెదపాలపర్రు, ముదినేపల్లి, పెదగొన్నూరు క్లస్టర్ల పరిధిలో అంగలూరు డైట్ కళాశాల, మచిలీపట్టణం ఏజె కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ విద్యార్థులు, ముదినేపల్లి మండలంలోని సిఆర్‌పీలు 59 ఎలిమెంటరీ పాఠశాలలకు చెందిన 1337 మంది విద్యార్థుల అభ్యసన స్థాయి, లక్ష్య సాధనలో వారి ప్రగతిని పరిశీలిస్తారు. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ విధానంలో విద్యార్థుల్లో విద్యాసామర్థ్యం సాధించడంలో పురోగతిని టీములు పరిశీలిస్తాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన బడుల వ్యవస్థలో విద్యలో పూర్తి రూపం ఎలా ఉందన్నది డైట్ విద్యార్థులు అంచనా వేస్తారు. జాతీయ నూతన విద్యా విధానంలో మూడవ తరగతి నుంచి విద్యార్థుల్లో కమ్యూనికేషన్స్ స్కిల్స్ సబ్జెక్టులపై అవగాహన నేర్చుకునే తత్వం పెరుగుతుందా లేదా అనే అంశాలను ముఖ్యంగా పరిశీలిస్తారు.



కోకో ఆడుతున్న క్రీడాకారులు



బహుమతులు అందుకున్న క్రీడాకారులతో నిర్వాహకులు

కోలాహలంగా అప్సా ఆటల పోటీలు

ముదినేపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ముదినేపల్లిలోని ఇండోసాక్సన్ - గౌతం హైస్కూలు ఆవరణలో కైకలూరు డివిజన్ స్థాయి పాఠశాలల విద్యార్థుల ఆటల పోటీలు కోలాహలంగా జరిగాయి. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గొల్లపూడి మోహనరావు ప్రారంభించిన ఈ ఆటల పోటీల్లో డివిజన్ పరిధిలోని ముదినేపల్లి, మండవల్లి, కైకలూరు, కలిదిండి మండలాలకు చెందిన 15 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 900మంది విద్యార్థులు పాల్గొన్నారు. వాలీబాల్, కోకో, టగ్‌ఆఫ్‌వార్, త్రోబాల్, మ్యూజికల్ చైర్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. నాయకులు అర్జా ప్రసాద్, ఎ.వి.కోటేశ్వరరావు, పి.కనకదుర్గా భవానీ, ఎస్వీ రాఘవయ్య, ఇండోసాక్సన్, గౌతం హైస్కూళ్ళ కరస్పాండెంట్లు ఎం.జార్జి, మదనకిషోర్ పాల్గొన్నారు.

మరో తుఫాన్ హెచ్చరిక !

మొదలైన రైతుల్లో ఆందోళన.. ముసునూరు మండలంలో కోత దశలో 4,400 ఎకరాలు

ముసునూరు, నవంబరు23(ఆంధ్రజ్యోతి): సెన్‌యార్ తుఫాన్ హెచ్చరికలతో ఖరీఫ్ వరి పంట చేతికి వస్తుందో లేదోనని వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులతో కురిసిన వర్షాలకు వరి పంటలు నేలకు ఒరిగిపోయి కొంత పంటకు నష్టం వాటిల్లింది. మిగిలిన పంట కోత దశలో ఉన్న నేపథ్యంలో మరో తుఫాన్ ముప్పు పొంచిఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో హడావుడిగా యంత్రాలతో వరి కోతలు కోస్తున్నారు. మండల వ్యాప్తంగా 6,300 ఎకరాల్లో వరిపంట సాగయింది. ఇప్పటివరకు 1900 ఎకరాల్లో మాత్రమే కోతలు పూర్తయ్యాయి. మిగిలిన 4,400 ఎకరాల్లో వరి పంట కోత దశలో ఉంది. ముసునూరు, కొర్లకుంట, యల్లాపురం, గుడిపాడు, గోగులంపాడు, గోపవరం, లోపూడి తదితర గ్రామాల్లో 30శాతం కోతలు పూర్తికాలేదు. చెక్కపల్లి, అక్కిరెడ్డిగూడెం, సూరేపల్లి తదితర గ్రామాల్లో 40 నుంచి 50శాతం శాతం వరికోతలు పూర్తికాగా కల్లాలపై ఉన్న ధాన్యాన్ని అధికారులు కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, రైస్ మిల్లులకు పంపుతున్నారు. తుఫాన్ వల్ల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కోతకు సిద్ధంగా ఉన్న పంటను కోసి, ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని రైతులకు వ్యవసాయ అధికారులు సూచనలు చేస్తున్నారు. మరో వారం రోజుల్లో వరి కోతలు ముమ్మరంగా సాగే సమయంలో తుఫాన్ వల్ల రోజు రోజుకు వాతావరణం మార్పులు చోటు చేసుకోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. మొంథా తుఫాన్ వల్ల నేలకు ఒరిగిన పంటలను యంత్రాలతో కోసేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు చేతికి వచ్చే సమయానికి మరో తుఫాన్ గండం రైతులను కలవర పెడుతోంది. ఈ తుఫాన్ వల్ల ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిస్తే ఆర్థికంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు.



ముసునూరులో కోతకు వచ్చిన వరి పంట

'రైతును రాజును చేయడమే ప్రభుత్వ లక్ష్యం'

ముసునూరు/ఆగిరిపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రానున్న ఐదేళ్లలో రైతును రాజును చేసేందుకు నూతనంగా ప్రభుత్వం ఐదు విధానాలతో కార్యాచరణ అమలుకు శ్రీకారం చుట్టిందని ముసునూరు ఏవో ఎ.చాముండేశ్వరి, ఆగిరిపల్లి ఏవో జె.భవాని తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతన్నా.. మీ కోసం' కార్యక్రమాన్ని మండలంలో సోమవారం నుంచి డిసెంబరు మూడో తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. రైతుసేవా కేంద్రం సిబ్బంది, మండల టీమ్ సంయుక్తంగా రైతు కుటుంబాల వద్దకు వెళ్లి పంటల వారీగా సమాచారం సేకరించి, ఏపీఏఐఎంఎస్ యాప్‌లో నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వం రూపొందించి నిర్దేశించిన ఐదు విధానాలు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు ధర, పాడి రైతులకు అండ విధానాలపై రైతులకు అవగాహన కల్పించి, పంట వివరాలను సేకరిస్తామన్నారు. ఈ ప్రణాళికలు రైతుల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తాయన్నారు. ప్రతిరోజు 90మంది రైతుకు కుటుంబాలను సర్వే చేసి ఆరు రోజుల్లో లక్ష్యాలను పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దివ్యక్షేత్రం ద్వారకాతిరుమల ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివాహాలు జోరుగా జరుగతుండడం, శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన మార్గశిరం ప్రారంభం కావడంతో పాటు అందరికీ సెలవు రోజు అవడం వల్ల ఉదయం నుంచే ఆలయానికి యాత్రికుల రాక ప్రారంభమైంది. దేవ స్థానంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. 15 వేల మందికి పైబడి భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది. సాయంత్రం నుంచి రద్దీ కాస్త తగ్గుముఖం పట్టింది.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

చినవెంకన్న ఆలయ అనివేటి మండప ప్రాంతంలో ఆదివారం బాలలు, మహిళలు నిర్వహించిన కోలాట ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. పెద చింతలపూడికి చెందిన శ్రీరాధాకృష్ణా కోలాట బృందం బాలలు, మహిళలు ముందుగా సంప్రదాయ దుస్తులు ధరించి క్షేత్రానికి వచ్చి కోలాటాలు జరుపుతూ స్వామి అమ్మవార్లను దర్శించు కున్నారు. ఆ తరువాత పలు దేవతామూర్తులను కీర్తిస్తూ వారు నిర్వహించిన కోలాట ప్రదర్శనతో ఆధ్యాత్మికత శోభిల్లింది.



శ్రీవారి దర్శనానికి వేచిఉన్న భక్తులు



విద్యార్థి గోపినాగ చైతన్యను అభినందిస్తున్న టీడీపీ గ్రామ అధ్యక్షుడు గణేష్

మాక్ అసెంబ్లీకి ఎంపికైన చైతన్యకు అభినందనలు

ముసునూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గం నుంచి మాక్ అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థి బొట్ల గోపినాగ చైతన్యను గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఉప్పలపాటి గణేష్ ఆదివారం అభినందించారు. గోపవరం ఎస్సీకాలనీలో ఒక పేద కుటుంబానికి చెందిన చైతన్య జడ్పీ పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ, నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ ఈనెల 26వ తేదీన అమరావతిలో జరిగే మాక్ అసెంబ్లీకి అర్హత సాధించడం సంతోషంగా ఉందన్నారు. మాక్ అసెంబ్లీలో ఒక ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికలు, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై మాట్లాడాలని ఆయన కోరారు. భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేంద్రరావు, గణేష్ అన్నయ్య వెంకటచౌదిరి తదితరులు పాల్గొన్నారు.



బెనర్జీని సత్కరిస్తున్న ఎన్టీఆర్‌జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

సహజకవి దండే బెనర్జీకి సన్మానం

కైకలూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సహజ కవి దండే బెనర్జీని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఘనంగా సత్కరించారు. ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు 2025వ సందర్భంగా రాష్ట్ర సృజనాత్మక, మల్లెతీగ, సాహిత్యసేవా సంస్థ ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సహకారంతో కవులు, రచయితలు, కార్టూనిస్టులు కళాకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో కైకలూరుకు చెందిన సహజ కవి దండే బెనర్జీ 'ఈ జీవితయానం -సాగే ఓ ప్రయాణం' అనే శీర్షికతో అలరించారు. ఈ శీర్షిక విశేషంగా ఆకట్టుకోవడంతో కలెక్టర్ చేతులమీదుగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, కవులు, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న గన్ని

పెద్దింట్లమ్మను దర్శించుకున్న గన్ని

కైకలూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారిని భక్తులు పెద్దఎత్తున ఆదివారం దర్శించుకున్నారు. కార్తీకమాసం ముగియడంతో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. కలిదిండికి చెందిన ఓ భక్తుడు పది కుర్చీలను ఆలయానికి వితరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాసు ఏర్పాట్లను పర్యవేక్షించి వసతులను కల్పించారు. గన్ని వీరాంజనేయులతో రాష్ట్ర వడ్డీ సాధికారిక సమితి కన్వీనర్ బలే ఏసురాజు, జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి శతజయంతి



కలిదిండి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం భగవాన్ సత్య సాయి శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ శ్యామల, వీఆర్వోలు ప్రసాద్, కాంతారావు, గుడిపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి : పుటపర్తి సత్యసాయి శతజయంతి కార్యక్రమాన్ని ఆదివారం ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్ శ్రీ సత్య సాయి చిత్రపటానికి ఎంపీడీవో వై.రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో అశోక్ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటిం చారు. సేవా కార్యక్రమాలతో సత్యసాయి ప్రజల హృద యాల్లో చిరస్థాయిగా నిలిచారని ఎంపీడీవో పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఏవో ఎంవీ రమణారావు, రెవెన్యూ, ఐకేపీ తదితర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి : సత్యసాయి ప్రవచనాలు మానవళికి అనుసరణీయమని పలువురు వక్తలు అన్నారు. చాట్రాయిలో ఆదివారం సత్యసాయి శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ సత్యధర్మం శాంతి ప్రేమ అహింస సిద్ధాంతాలను ప్రబోధించిన సత్యసాయి విశ్వ మానవాళికి దైవ సమానుడుగా నిలిచారని, ఈ శతాబ్దపు యుగ పురుషడని కొనియాడారు. పంచాయతీ కార్యదర్శి ఎంవీఎస్ నాగరాజు, వ్యాపారులు గోళ్ళ సుందర్‌కుమార్, పాల్గొన్నారు.



క్రైస్తవ నాయకులతో కలిసి మాట్లాడుతున్న ఈటే స్వామిదాసు

క్రైస్తవ సంక్షేమ పథకాలను తెలియజేయండి

నూజివీడు టౌన్, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవులకు ప్రభుత్వం అమలు చేస్తున్న వివరాలు, వాటి ప్రయోజనాలు విస్తృతంగా ప్రజలకు తెలియజేయాలని టీడీపీ క్రైస్తవ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు అన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు సమగ్రంగా అందుతున్నాయో ?లేదో క్షుణ్ణంగా పరిశీలించాలని, అమలు ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్రిస్టియన్ లీగల్ సెల్ చాట్ల రాజశేఖర్, కేటీ ప్రభాకర్, బిషప్ దేవరత్నం పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్ట్

ఆగిరిపల్లి, నవంబరు 23, (ఆంధ్రజ్యోతి) : మామిడి తోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై ఎస్ఐ కె. శుభశేఖర్ ఆదివారం మధ్యాహ్నం తన సిబ్బందితో దాడి చేశారు. ఈదర గ్రామ శివారులోని మామిడి తోటల్లో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.5,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. నూగొండపల్లిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి రూ.1,100 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.